57383

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

నవంబర్ 29, 2009

ఎయిడ్స్ భూతాన్ని తరిమేద్దాం!

హ్యాపీ బర్త్‌డే

(2009 నవంబర్ 29 నుంచి
2009 డిసెంబర్ 5 వరకు)

డి. పండు
2సం॥, నవంబర్-2007
సంతోష్-గణేష్
పెద్దతూండ్ల-రంగారెడ్డి

హార్షిణి
2సం॥, నవంబర్-29
లక్ష్మి-అశోక్‌కుమార్
పత్తిపాడు-ప॥గో॥

జి. సాయినాథ్‌రెడ్డి
2సం॥, డిసెంబర్-1
శోభ-అరవింద్‌రెడ్డి
మిర్యాలగూడ-నల్లగొండ

ఉదయ్‌కిరణ్
నవంబర్
జయలక్ష్మి-అంబికుమార్
ఏలూరు-ప॥గో॥

పి. సాయిరాం
నవంబర్
సత్యవతి-వెంకటరాములు
గొల్లచర్ల-వరంగల్

శివానీ(హనీ)
3సం॥, నవంబర్-2003
జయలక్ష్మి-సబ్బారావు
మధురానగర్-విశాఖపట్నం

ఎల్.నిహారిక
3సం॥, డిసెంబర్-1
కవిత-కోటిరెడ్డి
ముసారాంబాగ్-హైదరాబాద్

బి.ఎం.వి.రాఘవ
1సం॥,డిసెంబర్-1
లక్ష్మిఅలేఖ్య-నాగరాజు
విజయవాడ

ఎ. ప్రణీత్‌బాబు
9సం॥, డిసెంబర్-5
అనిత-రమేష్‌బాబు
నిజామాబాద్

కె. చింటు
4సం॥, నవంబర్-2005
అనసూయ-చెన్నయ్య
హిమాయత్‌నగర్-హైదరాబాద్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

మనలో మాట

జన్మజన్మల బంధం

మూఢనమ్మకం అనుకోండి! మతిలేని మాటనుకోండి!! మరొకటి అనుకోండి!!! సినిమా వాళ్లకు గత జన్మస్మృతులు గొప్ప కథావస్తువు. ఈ పాయింట్‌తో వచ్చిన సినిమాలన్నీ సూపర్‌డూపర్ హిట్లే! వసూల్‌రాజాలే. ఎందరో స్టార్లు ఆయా పాత్రల్లో జీవించారనుకోండి. నిన్నగాక మొన్న విడుదలైన 'అరుంధతి, మగధీర' కూడా ఆ టైపు చిత్రాలే. అయినా అంత కిక్కున్న సినిమాలను అంత సులువుగా మర్చిపోతామా. 'వదల బొమ్మాళీ! నిన్నొదల...' అంటూ బుర్రలో తిష్టవేసుకొని కూర్చోవూ. కామపిశాచి లాంటి విలన్‌ను వధించడానికి 'అరుంధతి' ఏకంగా పునర్జన్మ ఎత్తుతుంది. గత జన్మ పాయింట్‌కు మంత్రతంత్రాలు, క్షుద్ర విద్యలు దట్టించిన ఈ చిత్రం 'పసిడి నందులను' కూడా వదలలేదు. మూఢనమ్మకాలను నవనైపుణ్యాలతో మానవ మెదళ్లలోకి చొప్పించిన సినిమా కదా. ఆమాత్రం గౌరవసత్కారాలు చేయకపోతే ఎలా! గత జన్మలో ప్రేమించుకొని ఒకటి కాలేకపోయిన ఓ జంట తిరిగి జన్మిస్తుంది 'మగధీర'లో. తాజా జన్మలో కూడా ప్రేమలో పడుతుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదుగా. హీరోయిన్ చేతివేళ్లు తగిలినప్పడల్లా హీరోగారికి మధురానుభూతి కలుగుతుంది. ఏవేవో జ్ఞాపకాలు, దృశ్యాలు మదిలో మెదులుతుంటాయి. గత జన్మ విలనే ఈ జన్మలోనూ వీరిపాలిట విలన్. అతని అడ్డు తొలగించుకొని ఒక్కటవడం క్లైమాక్స్. గత జన్మ స్మృతులతో నిండిన ఈ చిత్రాన్ని చూడ్డానికి జనాలు తెగ ఎగబడ్డారు. టికెట్లకోసం జరిగిన తొక్కిసలాటలో తుచ్ఛమైన చొక్కాలు చింపుకున్నారు. తిరిగిరాని ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ అద్భుత చిత్రాన్ని ఒకటికి పన్నెండు సార్లు చూసిన ఓ కాలేజీ కుర్రోడైతే మగధీర లాగా మళ్లీ పుడతానంటూ రాసి మరీ చనిపోయాడు. 'గత జన్మల' పుణ్యమే ఇదంతా.

తాజాగా ... నిజ జీవితంలోనూ 'శాంభవి' అనే చిత్రం విడుదలైంది. ప్రధానపాత్రధారి ఏడున్నరేళ్ల పాప శాంభవి కాగా- దర్శకనిర్మాతలు, మాటల రచయితలు ఇంకా తెరకెక్కలేదు. సినిమా మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సెంటర్లలోనూ విజయవంతంగా నడుస్తోంది. ఇందులో బాల నటి శాంభవి నటన నభూతో నభవిష్యత్. భారీ ఆధ్యాత్మిక డైలాగులను సైతం అమాయకంగా, సునాయాసంగా చెప్పేస్తోంది. బౌద్ధ గురువు దలైలామా, ఆమె గతజన్మలో బుద్ధుని శిష్యులంట. అన్నట్టు ఈ సీక్రెట్ ఈ ఇద్దరికే తెలుసంట. స్క్రిప్ట్ సూపర్‌గుందికదూ. అంతేకాదు! శాంభవిని కలుసుకోవడానికి దలైలామా త్వరలో సూర్యనంది వస్తున్నాడంట. మరి అంత పెద్దమనిషి ధర్మశాల నుంచి కర్నూలుజిల్లాలోని కుగ్రామం చేరుకోవడమంటే చిన్న విషయమా! కోట్లతో కూడిన వ్యవహారమాయె!! ప్రస్తుతం 'శాంభవి అండ్ కో' అందుకవసరమైన నిధులు వసూలు చేసే పనిలోనే వుందని వినికిడి. అప్పడేకదా మరి స్వప్రయోజనం... స్వామి ప్రయోజనం నెరవేరేది.

మనం మాత్రం... 'ఎన్నో జన్మల బంధం నాదీ దలైలామాదీ' అంటున్న శాంభవి మాటలను గుడ్డిగా నమ్మేస్తున్నాం. ఓకే! మరి రేపెవరైనా వచ్చి 'గత జన్మలో మీరు నాకు పది లక్షల రూపాయలు అప్పన్నారు. తీరుస్తారా లేదా!' అని పీకలమీద కూర్చుంటే ఏం చేస్తాం? ఇచ్చేస్తామా! ఇవ్వకపోగా 'వెర్రి బాగా వంటబట్టినట్టుంది. వెళ్లి డాక్టరుకు చూపించుకో' అని ఓ ఉచిత సలహా మొహాన పడేస్తాం. కాదంటారా!

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
కథ	...	8
ఆరోగ్యం	...	12
క్రైమ్ కథ	...	17
అట్టమీది కథ	...	18
బాలనేస్తాలు	...	22
చూద్దామా	...	24
వికాసం	...	28

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఉద్యమాలకు ఊతం
ఆశయాలకు అంకితం



సమ్‌థింగ్ స్పెషల్ ... 10

ముత్యాల ముచ్చట్లు



సినిమా కబుర్లు ... 26

తెలుగు తెరపై
బాలలు బాల చిత్రాలు



తలనొప్పి బాధ తెల్సింది

ఈవారం అట్టమీది కథ దేశ దేశాల్లోని పెళ్లి వేడుకల విషయాలన్నీ ముచ్చట, మురిపెం గొలిపేలా అలరింప చేశాయి. ఆరోగ్యం ద్వారా తలనొప్పిలో వుండే మైగ్రేన్, టెన్షన్, క్లస్టర్ తలనొప్పుల రకాలన్నింటినీ విశ్లేషణ ద్వారా ఏ నొప్పికి ఏ ఉపశమన మార్గాలున్నదీ అవగాహన కలిగించారు. వ్యర్థాలే... చిత్రాలు మాకు కనువిందు చేశాయి. సమ్‌థింగ్ స్పెషల్‌లో సీతాఫలం గురించి సమగ్రంగా సమాచారమందించారు. సైన్స్ సాధించిన మహాద్భుతంగా రోబోను చెప్పుకోవచ్చు. తెల్సాలో ఉదహరించిన పదకొండేళ్ల తల్లి ఉదంతం నేటితరం తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తుందనడంలో సందేహంలేదు. బాల నేస్తాల కిషన్‌కి ఆల్ ద బెస్ట్. భాష పుట్టింది భావవ్యక్తీకరణకేనని చాటిన మనలోమాటతో మేమూ మాట కలుపుతాం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

పసందైన పెళ్లి వేడుకలు

నవంబర్ 15వ తేదీ ఆదివారం స్నేహ సంచికలో కవర్ స్టోరీలో దేశ దేశాల్లో పెళ్లి వేడుకలు వ్యాసం బాగుంది. నేపాల్, బంగ్లాదేశ్, అమెరికా, జపాన్, చైనా దేశాల విశేషాలు తెలిపారు. లాంఛనాలు, పెళ్లి జరిగే తీరు గురించి వివరించారు. అయితే విదేశాల్లో వరకట్నం, లాంఛనాల విషయం తెలుపలేదు.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

గమ్మత్తైన పెళ్లిళ్లు

నవంబర్ 15 ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ దేశ దేశాల్లో పెళ్లి వేడుకలు చదివిన తర్వాత రెండక్షరాల మాట గల పెళ్లి ఓ తీయని జ్ఞాపకమని, అందరి కలయికతో ఓ అనుభూతిగావుండే పెళ్లి సందడి గురించి ముఖ్యంగా నేపాల్‌లో పెళ్లి ఎలా జరుగుతుందో తెలుసుకుని నవ్వుకున్నాము. వరుడిని బుట్టలో పెట్టుకుని గాని గుర్రంపై కూర్చోపెట్టి గానీ తీసుకురావడం, పంతులుగారు ఆ పెళ్లి ఇష్టమేనా? అని ఇద్దరినీ అడగడం, వధువు అంగీకారం తర్వాత నుదిటిపై కుంకుమ దిద్దడం గమ్మత్తుగా వుంది. బంగ్లాదేశ్‌లో పెళ్లి మూడురోజులపాటు జరగడం, అమెరికాలో చర్చిలో పెళ్లిళ్లు జరగడం, ఉంగరాలు మార్చుకోవడం, దంపతుల మీద బియ్యం, గోధుమలను బంధుమిత్రులు చల్లడం పసందుగా వుంది. జపాన్ పెళ్లిలో వధూవరులు 'కిమికోస్' అనే వస్త్రాలు ధరించడం, చైనాలో పెళ్లి రోజున పెళ్లి కూతురికి ద్రాక్ష రసంతో స్నానం చేయించడం, కొరియాలో 'పేబాక్ సెర్మనీ' అని వర్ణించడం, రష్యా, థాయ్‌లాండ్, హాంకాంగ్, మన ఇండియాలో జరుగుతున్న పెళ్లిళ్ల గురించి చక్కగా వివరించారు.

కామిడి సతీష్‌రెడ్డి, పరకాల,
వరంగల్.

ఏమనాలో తెలీట్లా!

ఈ వారం స్నేహలోని అట్టమీది కథ బాగుంది. వివిధ దేశాల పెళ్లి వేడుకలు, సంబరాల తీరు చదువుతుంటే సంతోషంగా వుంది. సీతాఫల రసం కళ్లకు ప్రమాదం అని తెలియజేస్తే బాగుండేది. చివరి పేజీలోని పదమూడేళ్ల తల్లి గురించి చదివి హవ్వా... అనాలో, అయ్యో అనాలో తెలియడం లేదు. దక్షిణాసియాలో పెద్ద కట్టడం ఆంకోర్ చూడాలనిపించేలా వుంది. తలనొప్పి వివరాలు తలనొప్పి పుట్టిస్తున్నాయి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

హృదయానికి హత్తుకున్న కథ

వేకువనే స్నేహ పుస్తకం చదవడం ఈ వారం నాకు మధురానుభూతిని మిగిల్చింది. 'భాషావేశాలు' సరైన సమయంలో రాసి నాలాంటి వారందరికీ స్వాంతన కల్పించారు. ఇది మా హాస్పటల్ నోటీస్ బోర్డులో పెట్టాను. డేల్ కార్నెగీ రాసిన "హౌ టు విన్ ఫ్రెండ్స్ అండ్ లెర్న్ పీపుల్" 1977లో చదివాను. ఆ పుస్తకం గురించి శాస్త్రిగారు రాసింది చదువుతుంటే అరె నేను రాసుకున్నట్లే వుందే అనుకున్నాను. అయితే ఆ సూత్రాలను వారి సంస్థను నిర్వహించేటప్పుడు ఎలా అమలు పరిచారో చెప్పడం మరింత బాగుంది. ఈ చదువుల కోసం చావడాలు ఎప్పుడు ఆగుతాయా, ఎలా ఆపాలా అని ఆలోచించేవారికి "ఇట్లు మీ ముద్దుల కూతురు" హృదయానికి హత్తుకుంటుంది. ఒకే వారం ఇన్ని మంచి శీర్షికలు అందించినందుకు అభినందనలు. రచయితల ఫోన్ నంబర్లు ఇస్తే వారితో నేరుగా భావవ్యక్తీకరణకు అవకాశం వుంటుంది. ఉత్తరాలను పోస్టు చేయడానికి అడ్రస్ కూడా ఒకచోట ప్రింట్ చేస్తే బావుంటుంది.

డా॥డి.ఆర్.కె.ప్రసాద్,
చల్లపల్లి, కృష్ణా.

దండల పెళ్లి మంచిది

దేశ దేశాల్లో పెళ్లి వేడుకలు వ్యాసం బాగుంది. ఎక్కువ పెళ్లిళ్లు మత సాంప్రదాయాలపై ఆధారపడి జరుగుతున్నాయి. కొన్ని జాతులకు తెగలకు వారి సాంప్రదాయాల ప్రకారం జరుగుతుంటాయి. ఏది ఏమైనప్పటికీ వివాహ బంధం చాలా ప్రాధాన్యత గలది. అన్ని తంతుల్లోనూ పురుషాధిక్యత వుంటుంది. అశాస్త్రీయ విధానాలు కొనసాగుతాయి. అభ్యుదయ పద్ధతుల్లో దండల పెళ్లి మంచిది. పెళ్లికి ముందు స్పెషల్ మ్యారేజి యాక్టు ప్రకారం రిజిస్టర్ చేయించుకోవాలి. లేని ఎడల వివాహానికి చట్టబద్ధత వుండదు. దండల పెళ్లికి చట్టబద్ధత కోసం సెల్ఫ్ రెస్పెక్ట్ మ్యారేజ్ తీసుకురావాల్సి వుంటుంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక,
విశాఖ.

అభివృద్ధికారక పుస్తకం

రచయిత డేల్ కార్నెగీ సూత్రాలను అనుసరించే వ్యక్తుల్లో నేనొకణ్ణి. ఆటో దిగి, డబ్బులు ఇచ్చినపుడు డ్రైవరుతోనూ, షాపు కెళ్లినపుడు గేటు తెరిచే వాచ్‌మెన్‌తోనూ, పేపర్ బోయ్‌తోనూ, ఇంటికి వచ్చి చెత్త తీస్కెళ్లే కుర్రాడితోనూ థ్యాంక్స్ అంటే వారి ముఖంలో సంతోషం చూడగలం. ఒక వ్యక్తిని కలిసినపుడు ఆ వ్యక్తిని పేరుతో పలకరిస్తే, నాపేరు బాగా గుర్తు పెట్టుకున్నారని సంతోషపడతాడు. అమెరికా పుస్తకాలు వ్యక్తి అభివృద్ధికి దోహదపడతాయి. వ్యక్తి అభివృద్ధి అయితే సమాజం మారుతుందనేది వాళ్ల సూత్రం. అలాంటిదే "థింక్ అండ్ గ్రో రిచ్" పుస్తకం కూడా. అంజన గారు ముద్దుల కూతురు కథ రాసి కూతుళ్లున్న తల్లిదండ్రుల మనసులను కదిలించగలిగారు. మానవాభివృద్ధికి జరిగే పెళ్లివేడుకలు ఇతర దేశాలవి కూడా రాసినందువల్ల తెలియని ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి వీలయింది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

పెళ్లి వేడుకలు అదుర్స్

ఈ ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన దేశదేశాల్లో పెళ్లి వేడుకలు విశేషంగా ఆకర్షించాయి. పెళ్లి అనేది జీవితంలో మరపురాని, మరచిపోలేని తీపిగుర్తు. పెళ్లిళ్లు వారివారి ఆచార, వ్యవహార, మత సాంప్రదాయాల పద్ధతుల్లో జరుగుతాయి. భారత్ కాకుండా ఇతర దేశాల్లో పెళ్లిళ్లు ఎలా జరుగుతాయో విపులంగా తెలుసుకున్నాం. పెళ్లి అనేది ఒక పండుగ, వేడుక. విందు, వినోదాలతో అగ్నిసాక్షిగా మూడుముళ్లు, ఏడు అడుగులు నడిచే రెండు జీవితాల నూరేళ్ల సహజీవనం. లక్షలాది పాఠకులు, అభిమానులు వున్న ప్రజాశక్తి ఇలాంటి మంచి వ్యాసాన్ని ప్రచురించినందుకు నా శుభాకాంక్షలు. అందుకే ప్రజాశక్తిని మనసారా దీవిస్తున్నా. శతమానం భవతీ.

సాధినేని మురళీమోహన్ రావు,
యద్ధనపూడి, ప్రకాశం.

★

ఇంతకు ముందు ఎప్పుడూ లేనిస్పెషల్ ఆఫర్

ఈ అద్భుత అవకాశం 2500 మందికి మాత్రమే.

రూ.510/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.200/- లకే

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1		డివిజన్-2		డివిజన్-3		ఇవన్నీ
రూ.130/-	+	రూ.170/-	+	రూ.210/-	=	రూ.200/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ. 130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ. 170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ. 210/-

4 కోర్స్ గిఫ్ట్ పుస్తకాలు ఫ్రీ
(4 ఇన్ 1 పోకెట్ సైజులో)

1. వర్డ్ పవర్ (ఆంగ్ల పదాల అద్భుత శక్తి)
2. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ (ఇంగ్లీష్‌లో ఉత్తరాలు వ్రాసే పద్ధతి)
3. వెర్బ్స్ డిక్షనరీ (క్రియలు - వాటి రూపాలు)
4. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ (ఆంగ్ల సమాన పదాలు & వ్యతిరేక పదాలు)

గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ, డైరీ సైజు 12 cm X 17.5 cm లోనూ (ఆఫ్‌సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ. ఈ కోర్స్ తరువాత కూడా కొన్ని కోర్స్‌లు కలవు. వాటిని మీకు నియమిత నామ మాత్రపు ఫీజుతో పంపడం జరుగుతుంది.

క్రొత్త సంవత్సర కానుక



STUDENTS' ENGLISH INSTITUTE

Post Bag No. 8569,
New No. 203,(D) Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు, ఒక డైరీ మరియు 4 ఉచిత పుస్తకాలు ఇవన్నీ కలిపి కేవలం రూ. 200/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.
(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్సును పంపుటకు వీలుపడదు)

5006-122

స్పెషల్ ఆఫర్ కూపన్.

Name: ....

Address: ....

....

.... Pincode: ☐☐☐☐☐☐

స్ఫూర్తి

ఉద్యమాలకు ఊతం ఆశయానికి అంకితం

- దడాల సుబ్బారావు,
సి.పి.ఎం. తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి.

ఈ నవలలో విప్లవ పోరాటం వర్ణించిన తీరు చదువుతుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. వాడిన మాటల తుటాలు పెట్టుబడిదారుల గుండెలను చీల్చుకు పోతాయి. కానీ నవల అర్థాంతరంగా ఆగిపోవడమే కొంత నిరుత్సాహాన్ని కలిగిస్తుంది. అయినా ఇందులోని ప్రతిపేజీ చదువుతున్నకొద్దీ మనసును పరుగులు పెట్టిస్తూ ఉరకలు వేయిస్తుంది. మన ఆశయసాధనకు కార్యోన్ముఖులను కమ్మని ప్రబోధిస్తుంది.



నేను ఎస్ఎఫ్ఐలో పనిచేసేటప్పుడు ఎమర్జెన్సీలో సిపిఎం పార్టీతో పరిచయం ఏర్పడింది. డిగ్రీ చదువుతుండగా విజయవాడ రాజకీయ క్లాసులకు వెళ్లాను. అప్పటి నుండి నేను మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల ఆకర్షితుడినయ్యాను. నాటి నుండి నేను సిద్ధాంతం పట్ల అవగాహన పెంచుకోవాలనే కుతూహలంతో ఎక్కువగా సైద్ధాంతిక పుస్తకాలు, పార్టీ సాహిత్యం, తీర్మానాలు చదివేవాడిని. అంతేకానీ నాకు నవలలు చదివే అలవాటు లేదు. పైగా 'నవలల్లో ఏముంటుందిలే ప్రేమ పురాణం తప్ప' అనే దురభిప్రాయం వుండేది. అభ్యుదయ నవలలున్నాయని, వాటిని కూడా చదవాలని అప్పటికి నాకు తెలియదు. నేను కాకినాడలో డిగ్రీ చదువుతుండగా ఒక మిత్రుడు వచ్చి 'అమ్మ' నవల చదివావా?' అని అడిగాడు. 'లేదు' అన్నాను. "ఏమిటీ నువ్వు అమ్మ నవల చదవలేదా?" అని నిర్ఘాంతపోయి అడిగాడు. "నా దగ్గర అమ్మ నవల ఉంది, నేను ఇస్తాను చదువు" అని పుస్తకం తెచ్చిచ్చాడు. అది చదివిన తర్వాత కొంత ఉత్సాహం పెరిగింది. విప్లవ ఆశయాన్ని ప్రబోధించే నవలలు ఉంటాయని ఊహించనందుకు చాలా సిగ్గుపడ్డాను. ఆ తరువాత రాహుల్ సాంకృత్యాయన్ రాసిన "ఓల్గా సే గంగ" చదివి మరింత ఉత్సాహం పొందాను. నేను విశాఖలో ఆంధ్రా యూనివర్శిటీలో ఎం.ఎ చదివేటప్పుడు ఎస్ఎఫ్ఐ కార్యకర్త చేతిలో ఒక పుస్తకం చూశాను. 'అది ఏం పుస్తకం?' అని అడిగాను. 'ఉక్కుపాదం' నవల అన్నాడు. 'ఎలా వుంది' అనడిగితే "నీవు చదవలేదా" అని నన్నడిగాడు. లేదని చెప్పాను. "సిటీలో బుక్ ఎగ్జిబిషన్ పెట్టారు. అందులో అమ్ముతున్నారు. ఈ నవల చాలా బాగుంది" అని అన్నాడు. ఆ కామ్రేడ్ చెప్పిన వెంటనే నేను 'ఉక్కుపాదం' నవల కొని చదివాను. ఈ నవల నన్ను ఎంతగానో ఉత్సాహపరిచింది. ఎన్ని పేజీలు చదివినా, ఎంతసేపు చదివినా విసుగు లేకుండా మరింత కుతూహలంతో చదివిన మొట్టమొదటి నవల ఇదే. జాక్ లండన్ రాసిన తీరు, పెట్టుబడిదారీ విధానాన్ని తూర్పారబట్టిన పద్ధతి, ఎవరికైనా సులభంగా అర్థమయ్యేలా అనువదించిన పద్ధతి నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నవల చదువుతున్నప్పుడు చికాగోలో జరుగుతున్న పోరాటం మన దేశంలోనే జరుగుతున్నట్టుగా ఊహల్లోకి నెట్టింది. ఈ నవల ప్రాముఖ్యత ఏమిటంటే పెట్టుబడిదారీ విధానం ఎలా అంతరంగిక సంక్షోభానికి లోనవుతుందో మార్క్స్ రాసిన అదనపు విలువ సిద్ధాంతాన్ని సులభంగా అందరికీ అర్థమయ్యేటట్టు వివరిస్తుంది. పెట్టుబడిదారీ విధానం కూలిపోవడం సహజం అనే దాన్ని, సమాజ పరిణామ సిద్ధాంతానికి అన్వయించి చెప్పిన తీరు ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. ప్రజాసంఘాల్లో చురుకుగా పనిచేసే వారు ఈ నవల చదివితే ప్రాథమిక పరిజ్ఞానం ఏర్పరచుకోవాడానికి వీలుంటుంది.

ఏనవల అయినా సరే ఒక కుటుంబ వృత్తాంతాన్నో, లేదా ప్రజల జీవన విధానాన్నో కథగా తీసుకుని పరిస్థితులను కళ్లకు కట్టినట్టు వివరించి మార్పును కోరేవిధంగా ప్రబోధిస్తుంది. కానీ ఈ నవల ప్రత్యేకత ఏమిటంటే కథానాయకుడు తన వాద ప్రతివాదనల ద్వారా, చర్చల ద్వారా పెట్టుబడిదారీ సమాజపు డొల్లతనాన్ని చీల్చి చెండాడుతాడు.

ఈ నవలలో ప్రధానంగా సోషలిస్టు నాయకుడైన ఎర్నెస్టు ఎవర్డ్ హార్డ్, అతని ప్రియురాలు ఎలిన్, ప్రియురాలి తండ్రి, చర్చి అధిపతి బిషప్ మూర్ హౌస్, మరికొన్ని పాత్రలను ప్రధానంగా ఎంచుకున్నాడు. మానవతావాదంతో వ్యవహరిస్తూ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారికి ఏగతి పట్టిస్తారో తెలియపరిచే విధంగా వీరి పాత్రలను మలిచాడు. ఈ స్థాయిలో ప్రతిఘటనను కూడా చక్కగా వర్ణించాడు.

ఎర్నెస్ట్ ఎలిన్‌తో మాట్లాడుతూ "సియోరా మిల్లులో మీకు వాటాలున్నాయని విన్నాను. మీరు తొడుక్కున్న గౌనుకు నెత్తురు మరకైంది. మీరు తింటున్నది విషపు కూడు. ముక్కుపచ్చలారని పిల్లలు, పెద్దవాళ్ల రక్తం మీ ఇంటి దూలాల నుండి బొట్టు బొట్టుగా కారుతుంది. నేను ఇప్పుడు కళ్లు మూసుకుని కూర్చుంటే టప టపమని నాచుట్టూ రాలే నెత్తుటి బొట్టు చప్పుడు వినిపించింది" అంటూ పెట్టుబడిదారులు వారి భోగభాగ్యాల కోసం కార్మికులను ఏవిధంగా పీడిస్తారో పనిలో అలసటతో చెయ్యి పోగొట్టుకున్న కార్మికుడు జాక్సన్ ఘటనను వివరిస్తాడు. అతనికి పైసా నష్టపరిహారం రాకుండా ఏవిధంగా యాజమాన్యం వ్యవహరించిందీ, యజమానుల అడుగులకు మడుగులొత్తే లేబర్ ఆఫీసర్లు ఏవిధంగా కంపెనీకి కొమ్ముకాసి జాక్సన్‌కు ద్రోహం చేసిందీ తెలుపుతాడు. ఎర్నెస్ట్ చెప్పింది నిజమో కాదో తెలుసుకోవడానికి ప్రయత్నించిన ఎలిన్ వాస్తవం కళ్లకు కట్టినట్టు కనిపించేసరికి మనసు మార్చుకుని ఎర్నెస్ట్‌కి ప్రియురాలిగా మారుతుంది. తర్వాత సోషలిస్టుగా మారి పోరాటంలోకి దూకిన తీరును అద్భుతంగా వర్ణించాడు రచయిత. నేటికీ అనేక కంపెనీలలో కార్మికులు వికలాంగులవుతూనే ఉన్నారు. ముష్టి విదిల్చినట్టు నాలుగు రూపాయలు విదిల్చి కార్మికుల కుటుంబాలను రోడ్డునపడేస్తున్న ఘటనలు కోకొల్లలు.

కార్మికవర్గం అధికారంలోకి ఎలా వస్తుందో చాలా సులభంగా ఎర్నెస్టు వివరిస్తాడు. "మీ పెట్టుబడిదారీవర్గం పాత ఫ్యూడల్ ప్రభువర్గాన్ని కూలదోసి ఏవిధంగా అధికారంలోకి వచ్చిందో మా శ్రామిక వర్గం కూడా పెట్టుబడిదారీ వర్గాన్ని అదే విధంగా కూలదోసి అధికారం చేబడుతుంది. దీనికోసం ఒక యేడాది, 10ఏళ్లు, 1000ఏళ్లు ఎంతకాలం అని చెప్పలేం. కాలం ముఖ్యం కాదు. మా శ్రామిక వర్గం మనస్సులు అధికారం అనే పదంతో తాదాత్మ్యం చెందేదాకా శతకోటి పర్యాయాలైనా జపిస్తాం" అని ఒక క్లబ్‌లో మాట్లాడుతూ వర్గపోరాట ప్రాధాన్యతను ఎర్నెస్ట్ తన వాగ్ధాటితో వివరిస్తాడు. మనదేశంలో విప్లవం జయప్రదం కాదు. మీరు చేస్తున్న కృషి వృధా. మీ జీవితాలను వ్యర్థం చేసుకుంటున్నారు అనేవారు అనేకమంది ఉన్నారు. నేటి రాజకీయ పరిస్థితి చూసి నిరుత్సాహపడేవారికి ఈ వివరణ కనువిప్పు కలిగిస్తుంది. కార్యకర్తలకు ఉత్సాహాన్ని నింపుతుంది.

మతం బోధించే నీతి వేరు. ఆ సూక్తులను ఆచరణలో పెట్టమని హితబోధ చేస్తే పెట్టుబడిదారీ వర్గం ఏ విధంగా కక్ష కడుతుందో వివరించాడు. ఒకప్పుడు అమెరికాలో, యూరప్‌లో క్రైస్తవమతం, మత పెద్దలు అధికారంతో కుమ్మక్కై దోపిడీవర్గ పాలక వర్గాన్ని పదిలంగా కాపాడారు. ఎక్కడైనా ఏదేశంలోనైనా మతం

దోపిడీవర్గాన్ని కాపాడుతుంది.

బిషప్ మూర్ హౌస్ చర్చి అధిపతి. ఇతను ఒక సమావేశంలో మాట్లాడుతూ "క్రీస్తు బోధనలు సరియైనవనుకుంటే ధనవంతులంతా చేయవలసిన విద్యుక్త ధర్మాన్ని నేను ఉద్ఘాటిస్తున్నాను. మాలో శ్రీమంతులైన ప్రతి ఒక్కరూ ఇంటికొక దొంగను తీసుకునిపోయి అతణ్ణి సోదరుడిగా ఆహ్వానించండి. ఒళ్లమ్ముకుంటున్న అభాగ్యులలో ఒకరిని సోదరిగా ఆదరించండి. అప్పుడు ఈ శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి పోలీసుదళాలు, మెజిస్ట్రేట్లు అవసరం లేదు. జైళ్లు వైద్యశాలలుగా మారిపోతాయి. నేరస్తులు అదృశ్యమవుతారు. వారితోపాటు నేరం కూడా అంతరించిపోతుంది. ఇది క్రీస్తు బోధన" అని ప్రసంగిస్తాడు. ఈ మాటలు విన్న వెంటనే ఆయనను ప్రేమించే క్రైస్తవ సమాజం ఆయనను పక్కకు నెట్టి ఆయనకు పిచ్చి పట్టిందని నిర్ధారిస్తుంది. ఆయన ప్రసంగిస్తున్నంతసేపు పత్రికా విలేకరులు పేజీలకు పేజీలు రాసుకుంటూనే ఉన్నారు. కానీ మరుసటి రోజు పేపర్లు చూసేసరికి బిషప్ చెప్పిన మాటలను రాయకపోగా బిషప్ ఆరోగ్యం బాగోలేదు. మతి భ్రమించింది. అందువల్ల ఏవేవో మాట్లాడాడని, అలసిపోయి పడిపోయాడని ఆయనపట్ల కృతజ్ఞతాభావంతో చర్చి ఆయనకు విశ్రాంతిని ప్రసాదించిందని వార్తలు వచ్చాయి. పెట్టుబడిదారుల ఉప్పు తింటూ పొట్ట పోషించుకుంటున్న పత్రికా యాజమాన్యం పాతుకుపోయిన, కాలం చెల్లిన వ్యవస్థకు అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని మరల్చేందుకు తాపత్రయపడింది. దీనిపై ఎర్నెస్ట్ మాట్లాడుతూ "అవి దినపత్రికలు కావు. పెట్టుబడిదారీ విషపుత్రికలు" అన్న వ్యాఖ్యానం నేటికీ సజీవమైంది. నేడు మన దేశంలో పత్రికలు వ్యవహరిస్తున్న తీరు ఇదేవిధంగా కనబడుతుంది. సిపిఎం పార్టీ అనుసరిస్తున్న ఎత్తుగడలను, రాజకీయ విధానాన్ని ప్రజలకు అందించకపోవడమే కాక కుతంత్రంతో వక్ర భాష్యాలు చెప్పే విషపుత్రికలు నేడు మన దేశంలో కోకొల్లలు.

"సోషలిజం అసాధ్యం. ఈ దేశంలో సోషలిజం రాదు" అని వాదించేవారికి ఈ నవలలో సరైన వివరణ ఇస్తాడు. "పెట్టుబడిదారీ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం అనివార్యం. సోషలిజం కూడా అనివార్యం మాత్రమే కాదు మీ సన్న, చిన్న పెట్టుబడిదారులు కూడా తుడిచిపెట్టుకుపోవడం అనివార్యం" అంటూ ఈ విధంగా వివరిస్తాడు.

"అమెరికాలో ఒక సంవత్సరంలో ఉత్పత్తి అయిన మొత్తం సంపద 4 లక్షల కోట్ల డాలర్లు అనుకుందాం. వేతన రూపంలో 2 లక్షల కోట్ల డాలర్లు తీసుకున్నారు. అంటే శ్రమ శక్తి కొనుగోలు చేయగలిగింది 2 లక్షలకోట్ల విలువగల సరుకు మాత్రమే. అనగా మరో 2 లక్షల కోట్ల డాలర్ల సరుకు మిగిలిపోయింది. మిగిలింది ఏమవుతుంది? అని అడుగగా విదేశాలలో అమ్ముకుంటాం అని ఒకతను చెప్పాడు. అభివృద్ధి చెందిన అన్ని పెట్టుబడిదారీ విదేశాలలోనూ ఇలాగే మిగులు ఉండిపోతే ఏం చేస్తారు? అని అడగ్గా వర్ధమాన దేశాలకు తోసేస్తాం అన్నాడు మరొకడు. ఒక వేళ అన్ని దేశాల్లోనూ మిగులు నిల్వలు ఉండిపోతే అప్పుడు ఏమవుతుంది? పెట్టుబడిదారీ వ్యవస్థ ఏవిధంగా మన్నగల్గుతుంది? అని ప్రశ్నించి పెట్టుబడిదారీ వ్యవస్థ తనంతట తాను కట్టుకున్న లాభాల భయంకర కట్టడం కింద కూలిపోతుంది. యంత్రాలపై ఆధిపత్యం గురించి పోరాటం ప్రారంభమవుతుంది. కార్మికులు గెలిచారా! సమస్త ప్రపంచంలోనూ ఒక నూతన యుగం ప్రవేశిస్తుంది. అప్పుడు కార్మికవర్గం ఉత్పత్తి, సంపదను సమానంగా పంచుకుంటుంది. ఇది అనివార్యం. దీనినే సోషలిజం అంటారు. అని వివరిస్తూ సోషలిజం అనివార్యమని బల్లగుద్ది మరీ చెబుతాడు. నూతనంగా ప్రజాసంఘాలలో పని చేస్తున్న వారు, కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు ఈ నవల భావితరాలవారికీ మరింత ఉత్తేజానిస్తూ కార్యోన్ముఖులను చేస్తుంది.

మనదేశంలో స్వతంత్ర పోరాటం జరుగుతున్న రోజులలో బ్రిటీష్ వారిని ఈ దేశం నుండి వెళ్లగొట్టగలం అనే నమ్మకం కాంగ్రెస్‌కి లేదు. కాని కమ్యూనిస్టు పార్టీ బ్రిటీష్‌వారిని తన్ని తరిమి వేయగలం అనే విశ్వాసంతో పని చేసింది. 100 సంవత్సరాలక్రితం రాసిన ఈ నవలలో "బ్రిటీష్ సామ్రాజ్యం ముక్కచెక్కలవుతుంది. భారతదేశంలో తిరుగుబాట్లు ఉధృతంగా ఉంటాయి" అని పేర్కొన్నాడు. "బ్రిటీష్ సామ్రాజ్యం కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుంది. భారతదేశాన్ని ఇంగ్లండ్ త్వరలోనే కోల్పోవడం తప్పదు" అని రచయిత ఆనాడే విశ్లేషించాడు.

ఇది 1947లో వాస్తవరూపం దాల్చింది. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ బ్రిటీష్‌వారితో పలుమార్లు రాజీపడుతూ వచ్చింది. కానీ వర్గ దృక్పథంతో పని చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ మాత్రమే బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడింది. మనదేశంలో మార్క్సిస్టు సిద్ధాంతంతో వర్గ దృక్పథానికి కట్టుబడి పని చేసేవారు మాత్రమే దోపిడీదారుల ఉక్కుపాదానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడతారని అనుభవం తెలుపుతుంది.

అమెరికా అంటే చాలామందికి మోజు. రిపబ్లికన్లు, డెమోక్రాట్లు పెట్టుబడిదారీ విధాన పరిరక్షకులే అని కాకుండా ప్రజల కోసం పని చేస్తారని అమాయకంగా నమ్మే జనం చాలా మంది ఉన్నారు. కాని వీరిద్దరినీ చీల్చి చెండాడుతూ ఎర్నెస్ట్ అమెరికన్ పార్లమెంటులో ప్రసంగిస్తాడు. "ఎర్నెస్ట్ నిరుద్యోగుల బాధలను వర్ణిస్తూ ప్రసంగిస్తున్నప్పుడు రిపబ్లికన్లు, డెమోక్రాట్లు అల్లరిచేస్తూ అవహేళనగా కేకలు వేస్తుంటారు. అప్పుడు ఎర్నెస్ట్ ఈవిధంగా ఆ రెండు పార్టీలను ఉతికి ఆరేస్తాడు.

"మిమ్మల్ని ప్రభావితం చేయగలిగిందేదో నాకు తెలుసు. మీరు ప్రభావితులు కాకపోవడానికి అటువంటి మనస్సులు మీకులేవు. మీరు వెన్నెముక లేని అవిటి వెధవలు. పైగా మేం రిపబ్లికన్లం, మేం డెమోక్రాట్లం అని రొమ్ములు విరుచుకుని తిరుగుతారు. రిపబ్లికన్లు లేరు, డెమోక్రాట్లు లేరు. మీరిద్దరూ పెట్టుబడిదారుల ఎంగిలి ఆకులు నాకేవాళ్ళు. వాళ్ళకు తార్పుడుగాళ్ళు, వాళ్ళ అడుగులకు మడుగులొత్తే క్షుద్రజీవులు" అని గర్జిస్తూ చివరగా "తెగబలిసిన మృగాలు మీరు" అని వారిపై విరుచుకుపడతాడు. నేటికీ ఇది ఎంత వాస్తవమో వర్తమాన రాజకీయాలను పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది. రీగన్, క్లింటన్, బుష్ నేడు ఒబామా ఎవరైనా సరే పెట్టుబడిదారీ ఉక్కు పాదాలకు సలాం చేస్తూ కార్మికవర్గ రక్తాన్ని పీల్చి పిప్పి చేసే పాలకులే తప్ప ప్రజాస్వామ్య పరిరక్షకులు కారని నేడు మనకు అనుభవం చెబుతున్నది.

చికాగోలో కార్మికులు చాలా భీకరంగా పోరాడుతున్నారు. ఈ పోరాటం తీరుని అమోఘంగా వర్ణించడమేకాక కళ్ళముందు ప్రత్యక్షంగా నిలిపాడు. పోరాడుతున్న కార్మిక సైన్యంలోకి శత్రుగూఢచారి ప్రవేశిస్తాడు. అతణ్ణి పట్టుకుని మరణశిక్ష విధిస్తారు. ఈ గూఢచారి అనేకమంది కార్మికులను పొట్టన పెట్టుకున్న దుర్మార్గుడు. ఇతనికి మరణశిక్ష పడేసరికి ప్రాణభిక్ష పెట్టండని దీనంగా కాళ్ళా వేళ్ళాపడి బతిమాలుతాడు. ఆ సందర్భంగా నాయకురాలు ఎలిన్ "ప్రాణదానం చేయమని దీనంగా ప్రాధేయపడే పిరికివాని కంటే ధైర్యంగా ఉరికంబమెక్కే వీరుని చూడడమే చాలా సుళువు" అంటుంది. ప్రజలమధ్య పనిచేసే ఏ కార్యకర్తకైనా ఈ వాక్యం ఎంతో స్ఫూర్తిని కలిగిస్తుంది. శ్రమశక్తికి, పెట్టుబడికి మధ్య సంఘర్షణలో చికాగో ఎప్పుడూ తుఫాన్‌కేంద్రంగానే ఉండేది. పోరాడుతున్న కార్మికవర్గాన్ని 'ఉక్కుపాదం' అణచివేసింది. ఆ సందర్భంగా ఎర్నెస్ట్ తన ప్రియురాలితో ఈ విధంగా అంటాడు. "ప్రియా! ఈసారి మనం ఓడిపోయాం. కానీ ఎప్పటికీ కాదు. ఓటమి నుండి మనం చాలా నేర్చుకున్నాం. ఇతోధిక వివేకంతో క్రమశిక్షణతో రేపు మళ్ళీ ఉద్యమం రెక్కలు విప్పుతుంది" అని అంటాడు.

మనదేశంలో కూడా కమ్యూనిస్టు పార్టీ అనేక వీరోచిత, రైతాంగ, కార్మిక పోరాటాలను నడిపింది. వేలాది మంది యోధులు అమరులయ్యారు. అమరుల ఆశయాలు నెరవేరాలంటే మనదేశంలో కూడా ఒక సంవత్సరంలోనో, 10సంవత్సరాలలోనో విప్లవం జయప్రదమవుతుందని ఆశించలేం. కానీ మనం విరామమెరగకుండా కృషి చేస్తే మన ఆశయాన్ని తప్పక సాధిస్తాం.

ఈ నవలలో విప్లవ పోరాటం వర్ణించిన తీరు చదువుతుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. వాడిన మాటల తూటాలు పెట్టుబడిదారుల గుండెలను చీల్చుకు పోతాయి. కానీ నవల అర్థాంతరంగా ఆగిపోవడమే కొంత నిరుత్సాహాన్ని కలిగిస్తుంది. అయినా ఇందులోని ప్రతి పేజీ చదువుతున్నకొద్దీ మనసును పరుగులు పెట్టిస్తూ ఉరకలు వేయిస్తుంది. మన ఆశయసాధనకు కార్యోన్ముఖులను కమ్మని ప్రబోధిస్తుంది.

★

మట్టి సాక్షిగా...

- లయన్ సి. కామేశ్వరరావు.



పూల మౌన సంభాషణాల్లో
పరవశించిన పరిమళం మట్టి
పచ్చ చేల పరువంలో
[illegible] మట్టి
[illegible] పాటతో
[illegible] కదిలించే చేతన మట్టి
[illegible] నడకల్లో
[illegible] నవ్వుకే మట్టి
అప్పుడే కన్ను తెరచిన లేగదూడ
"అంబా" అన్న అరుపులోని అనుబంధం మట్టి
చినుకు చిత్రంలో శిరసెత్తిన
జీవన సౌరభ్యక్షం మట్టి
కన్నెపిల్ల కరకమలాలలో
వెన్నెల సోముల రాగమంజరి మట్టి
కృష్ణా గోదావరుల ఉరవళ్ళ పరవళ్ళలో
ఊసులాడిన మమతల సంగీతలహరి మట్టి
పాడిపంటల ప్రగతి రూపమైన గోవులు
కొట్టంలోకి చేరిన వేళ రేగిన గోధూళి మట్టి
తెలిమంచు సోనల్లో తొంగి చూచిన
గడ్డి పువ్వు పెదవిపై విరిసిన చిరునవ్వు మట్టి
బతుకు చీకటైన వారి కళ్ళల్లో
సప్తవర్ణ కాంతి ధనువు మట్టి
వెదురును వేణువుగా మార్చిన
మధుర మోహన స్వరాల మూర్తి మట్టి
కుహుకుహూ రాగాల కోకిల పాటలో
వసంతోత్సవ పూల మాలిక స్ఫూర్తి మట్టి
చిలక పలుకుల నవ్య సౌందర్యంలో
పచ్చని ప్రకృతి మురిపాల మూట మట్టి
నాట్య భంగిమలోని నవవిధ రీతుల్ని
నెమలికి నేర్పిన నాట్య వన దేవత మట్టి
మానస సరోవర విజయ విహారి
కాయంచకు నడక నేర్పిన వొజ్జ మట్టి
శుట్టే విశాల హృదయతత్వాన్ని
మట్టి మహోన్నత మానవీయ రూపాన్ని
మట్టి ప్రేమామృత దివ్యత్యాశాన్ని
వర్ణింప ఎవరికైనా తరమా...! ★

ఆటగాళ్లు

- సి.హెచ్. మధు

దుఃఖానికి చిరునామా కొరకు
అన్వేషణ ఒక నాటకం తప్ప
దుఃఖం కనిపించనిదెక్కడ?
చిరునామా దొరకటంలేదా
నా చిరునామా యివ్వండి!
దుఃఖం నా కనురెప్పలకు కాపలాగావుంది.
సంక్షేమం, ఉచితం, సబ్సిడీ
వరాల జల్లుల మధ్య
దుఃఖం ఎక్కడిదని
ప్రభువులంటుంటారు
నా వ్రేలును నా కంటిలో పొడవటం
తెరవెనుక ప్రణాళిక అయినపుడు
దుఃఖానికి కొదవేముంటుంది?
ఎక్కడో దారి తప్పుతారు
వాళ్లు వెలుగులలో వుండి
మమ్ము చీకట్లో వుంచుతారు
వాళ్లు నవ్వుతూ మమ్ముల ఏడిపిస్తారు.
ఏడుపు ఒక షోకు కాదు
విషాదం ఒక నాటకం కాదు
దుఃఖం ఒక నటన కాదు
రాజ్యాంగం సాక్షిగా
శ్రమజీవి వాస్తవమైన
దుఃఖం
ఇక్కడ పేదల పాలిట శాపంగా మారింది
దుఃఖమే లేదని వెదుకుతున్న ప్రభువులు
గుడ్డివాళ్లు గాదు
నటిస్తున్న గొప్ప ఆటగాళ్లు వాళ్లు
★

వాడెప్పుడూ...!

- సి. కె.రావు.

వాడెప్పుడూ
ఆకాశం వైపు చూస్తుంటాడు
దివినున్న నక్షత్రాలను
భూమికి దించాలని...!
వాడెప్పుడూ తిమిరంతో సమరం చేస్తుంటాడు
పాలపుంతల పరవశత్వాన్ని
పదిమందికి పంచాలని..!
వాడెప్పుడూ
కలలు కంటూ ఉంటుంటాడు
అంతస్థుల అహంకారాన్ని
అవనిపైకి దించాలని...!
వాడెప్పుడూ
మట్టిలోనే నిద్రిస్తుంటాడు
మట్టిమనిషి మనుగడలో
మానవత్వ ముందని చెప్పాలని...!
వాడెప్పుడూ
కన్నీటితో కరచాలనం చేస్తుంటాడు
ఊళ్ళన్నీ ఏకమైతే
ఉప్పెన ముంచుకొస్తుందనటానికి...!
వాడెప్పుడూ
ఉనికి గురించే మాట్లాడుతుంటాడు
ఆశయాలకు ఆచరణకు
విడదీయరాని ముడివేయాలని...!
వాడెప్పుడూ
మౌనంగా శ్వాసిస్తుంటాడు
ప్రతి మౌన పదగతిలో
వాడీ వేడీ ప్రవహిస్తుందదాలని...!
వాడెప్పుడూ
కవితామృతాన్ని తాగుతుంటాడు
జనం గుండెల్లో చైతన్య దీపికై
నిరంతరం జ్వలించాలని....!! ★

నవ్వుల్ - పువ్వుల్

5 నిమిషాలు

భర్త : చూడు డియర్, డిన్నర్ రెడీ కాకపోతే నేను హోటల్‌కు వెళతా.

భార్య: ఏమండీ కాస్త ఐదు నిమిషాలు ఆగుతారా!

భర్త : ఎందుకు? భోజనం ఐదు నిమిషాల్లో వండేస్తావా?

భార్య: లేదు డియర్! నేను కూడా బట్టలు మార్చుకుని మీతో హోటల్‌కు వస్తాను.

కిడ్నాప్

ప్రసాద్ : ఎందుకురా అంత విచారంగా వున్నావ్?

శ్రీను : పోయిన వారం మా అత్తను ఎవరో కిడ్నాప్ చేశారు.

ప్రసాద్ : అందుకు నువ్వు చాలా ఆనందంగా ఉండాలి కదా?

శ్రీను : నేను ఇన్నిరోజులూ చాలా ఆనందగా ఉన్నాను. అయితే ఈరోజు కిడ్నాపర్లు ఓ చీటీ పంపించారు. ఏభైవేలు చెల్లించకపోతే మా అత్తను వెంటనే వదిలేస్తారట.

చూడలేక.....!

సుబ్బారావు : నన్ను వాడు ఆ విధంగా కొడుతుంటే నువ్వు ఎందుకు వెళ్ళిపోయావు?

అప్పారావు : నా ప్రియమిత్రుడు తన్నులు తినటం చూడలేక వెళ్ళిపోయాను.

అప్పడాలకర్ర

ఆండాళ్ళు : అప్పడాల కర్రొకటి కావాలి వదినా.

పంకజం : ఇప్పుడెందుకండీ?

ఆండాళ్ళు : అబ్బే అలాంటిదేం లేదు. మాది నిన్నే విరిగిపోతేనూ...

పంకజం : అంతేనా! అత్తాకోడళ్ల మధ్య ఏమైనా ...

పెళ్లి

మేనేజర్ : నీకు పది రోజులు సెలవు ఎందుకోయ్?

క్లర్క్ : నేను పెళ్లి చేసుకుంటున్నాను సార్.

మేనేజర్ : నిన్ను చేసుకోవడానికి అంగీకరించిన ఆ బుద్ధిలేని అమ్మాయి ఎవరు?

క్లర్క్ : మీ అమ్మాయే సార్.

వెనక్కి

డ్రైవర్ : సార్! కారు ఇక ఏమాత్రమూ ముందుకు వెళ్లదండి. పెట్రోల్ అయిపోయింది.

యజమాని : అయితే కారును వెనక్కి తిప్పి ఇంటికి పోనివ్వు.

టాపిక్

సుబ్బారావ్: మా ఆవిడ ఏ టాపిక్ మీదైనా సరే గంటల కొద్దీ మాట్లాడగలదు.

అప్పారావ్: ఇదేమంత గొప్ప విషయం కాదు. మా ఆవిడైతే ఏ టాపిక్కు లేకుండానే గంటల కొద్దీ మాట్లాడగలదు.

ట్రాఫిక్ పోలీస్

బాబు : మా నాన్న ఒక్క చేత్తోనే బస్సు ఆపగలడు.

వెంకీ : ఎంత ఆశ్చర్యం! ఆయన అంత బలవంతుడా?

బాబు : లేదు ఆయన ట్రాఫిక్ పోలీస్.

ఆప్త మిత్రుడు

క్లర్క్ : సార్! మీ ఆప్తమిత్రుడి నుంచి మీకు ఫోన్.



ఆఫీసర్ : అతను నాకు ఆప్త మిత్రుడని నీకెలా తెలుసు?

క్లర్క్ : ఆయన ఫోన్లో "మూర్ఖుడు ఆఫీసుకు వచ్చాడా"? అని అడిగారండి.

-లక్ష్మీనారాయణ

కథ

రాత్రి అవుతుండగా పనిపిల్ల చెల్లెలు మళ్ళీ వచ్చి, "అన్నయ్యొచ్చాడు. నిన్ను పిల్చుకురమ్మన్నాడు. పద!" అంది. అన్న వచ్చాడని వినగానే ఎందుకో దాని మొహంలో భయం అలుముకుంది లోపలికెళ్లి "వెళ్తానమ్మా" అని మా ఆవిడకు చెప్పి వెళ్ళబోతుంటే, మా ఆవిడ ఒక డబ్బాలో దానికి ఏదో ఇచ్చింది.

"ఇంకా పూజ అవలేదు. రేప్పొద్దున్నే రా, ప్రసాదం తీసుకుపోదువు గానీ, అన్నట్లు రేపొచ్చేప్పుడు ఈ డబ్బా తీసుకురా!" అంది. పనిపిల్ల వరండాలోకి రాగానే దాని చెల్లెలు సైగలతో, "టపాకాయలు ఇచ్చారా?" అని అడిగింది.

పనిపిల్ల

మూలం : మైథిలీకథ - ప్రదీప్ బిహారీ

తెలుగు : ఆర్. శాంతసుందరి

ఈ పిల్ల సరిగ్గా పనిచెయ్యదని కాలనీలో అందరూ అంటూ ఉంటారు. శ్రద్ధగా పనిచెయ్యదనీ, నాగాలు ఎక్కువగా పెడుతూ ఉంటుందనీ అంటారు. దీన్ని పనిలో పెట్టుకోవడం తలనొప్పేనని ఆడవాళ్లందరూ అభిప్రాయపడతారు. అయినా గతిలేక దీనితోనే పని చేయించుకుంటారు.

నా భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. ఆరేళ్లుగా వెన్ను నొప్పి తగ్గడమేలేదు. ఎందరో డాక్టర్లకి చూపించినా నయం కాలేదు. మందులతో తగ్గినట్టే తగ్గి, ఏ కాస్త ఎక్కువ పనిచేసినా మళ్లీ మొదటికొస్తుంది. నడుం పట్టుకుపోయే, ఒంగి చేసే పనులేవీ ఆవిడవల్ల కావు. అందుకే ఇల్లు ఊడ్చి తుడవడం తనవల్ల కాక, పనిపిల్లకోసం వెతుకుతోంది. ఎవరూ సరిగ్గా నిలిచి పని చెయ్యకపోయేసరికి, ఈ పిల్లనే పెట్టుకోవలసి వచ్చింది.

ఆ పిల్ల పనిలోకి వచ్చిన రోజున, "మీ అమ్మను రమ్మను. జీతం విషయం మాట్లాడాలి" అంది మా ఆవిడ.

"అక్కర్లేదు. నాతోనే మాట్లాడొచ్చు. ఇరుగు పొరుగు వాళ్లని అడిగి చూడండి. అప్పటికీ నా పని నచ్చకపోతే మాన్పించెయ్యండి" అంది ఆ పిల్ల పెద్ద నాపసానిలా.

"రెండ్రోజులు పనిలోకొస్తే వారం ఎగ్గొడతావని విన్నాను!"

"ఇప్పుడు అలా ఏం కాదమ్మా! నా దగ్గర ఎక్కువ ఇల్లు లేవు. రెండు పూటలా వచ్చి చేసిపోతాను."

"కానీ, వేలెడంత లేవు! నీ వల్లేమవుతుంది?" అన్నాను.

తలవంచుకుని, "అన్ని పనులూ చేస్తానయ్యా! ఇల్లూడ్చి తుడవడం, అంట్లు తోమడం....."

"సరే ఐతే, వంద రూపాయలిస్తాను. రేపటి నుంచే పనిలోకిరా!" అంది మా ఆవిడ మనసులో ఏవో లెక్కలు వేసుకుని.

"కుదరదమ్మా! మీ ఇంట్లో పని చెయ్యడానికని కొన్ని ఇళ్లు వదులుకున్నాను. ఆ చివరింట్లో మాత్రమే చేస్తున్నాను. వాళ్లింట్లో నీళ్లకి మోటారుంది. మీ ఇంట్లో చేతిపంపు కొట్టాలి కదా!" మీకామాత్రం తెలీదా అన్న ధోరణిలో మాట్లాడిందాపిల్ల.

"సర్లే పనిచెయ్యి. ఎలా చేస్తావో చూసి జీతం విషయం ఆలోచిస్తాను. పని బాగా చెయ్యాలి. శుభ్రంగా చెయ్యాలి" అని, నా వైపు చూపిస్తూ అన్నట్టు "డిఎస్‌పిగారు అయ్యగారికి స్నేహితులు. ఒక్క చీపురుపుల్ల కూడా బయటికి పోకూడదు జాగ్రత్త!" అంది.

ఆ పిల్ల పల్లెత్తుమాట అనకుండా అంతా వింది. పది పదకొండేళ్లున్న ఇంత చిన్న పిల్ల మా పెద్ద ఇంటిని ఊడ్చి, తుడిచి, గిన్నెలు కడగగలదా అని అనిపించింది నాకు. రెండు పూటలా వచ్చి ఆ పిల్ల పని చెయ్యడం మొదలు పెట్టింది. ఒకరోజు "ఇంత తెల్లారగట్టే ఎందుకొస్తుంది పనిపిల్ల" అని అడిగాను మా ఆవిణ్ణి.

"పెందలాడే పని ముగించుకుని స్కూలుకెళ్తుంది" అంది మా ఆవిడ. మా ఆవిడ దినచర్యలో కొత్తగా ఒక అంశం చేరింది. రోజూ నేను ఆఫీసునుంచి రాగానే పనిపిల్ల గురించి ఏదో ఒకటి చెప్పేది. ఒక్కోసారి వినేవాణ్ణి కానీ ఒక్కోసారి విసుగొచ్చేది.

ఒకరోజు మా ఆవిడ పనిపిల్ల ఇంట్లోని వస్తువులన్నిటినీ కళ్లార్పకుండా చూస్తూ ఉంటుందనీ, దాని పద్ధతేమీ బాగాలేదనీ అంది. కాస్త దాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండమని సలహా ఇచ్చాను.

ఒకరోజు నేను గడ్డం గీసుకుంటూంటే మా ఆవిడ పనిపిల్లని కోప్పడడం వినిపించింది. "ఏమిటీ? ఇల్లు తుడుస్తున్నావా, టీవీ చూస్తున్నావా? వెళ్లు! వెళ్లి పనిచూసుకోపో!" అంటోంది.

పనిపిల్ల బకెట్టు తీసుకుని పంపు దగ్గరకు వెళ్లి పోయింది. ఈ మధ్య మా ఆవిడ పనిపిల్లని చీటికీ మాటికీ తిట్టడం మొదలు పెట్టింది. ఒక రోజు నాతో, "దీనికి పని మీద కన్నా వాగుడు మీదే ధ్యాసెక్కువ. తెగ వాగుతుంది!" అంది.

"ఏమంటుంది?"

"ఏవేవో అర్థంలేని ప్రశ్నలేసి ప్రాణాలు తీస్తుంది"

"ఏం ప్రశ్నలు?"

"మీ ఇంట్లో వాషింగ్‌మిషన్ మిగతా ఇళ్ళల్లోని వాటిలా లేదు, ఎవరైనా ఫ్రీగా ఇచ్చారా? అని అడిగింది మొన్న!"

నాక్కూడా కోపం వచ్చింది. "నువ్వు కాస్త గుంభనంగా ఉండు. పనిపిల్లని పనిపిల్లలాగే చూడాలి, అట్టే చనువివ్వకూడదు. పని విషయం తప్ప మరే విషయం మాట్లాడొద్దు దానితో" అన్నాను.

'అంతే కాదండీ! ఈ బ్లాక్ ఎండ్ వైట్ పోర్టబుల్ టీవీ చూస్తే ఏం మజా వస్తుంది? పెద్ద కలర్ టీవీ కొనుక్కోవచ్చుగా? అని కూడా అడిగింది'. ఆ రోజే మా ఆవిడ ఒక నిర్ణయం తీసుకుంది. పనిపిల్ల వాగుడు తగ్గించకపోతే, దాన్ని పనిలోంచి తీసేస్తానని అంది. కానీ, వెంటనే నడుం నొప్పి గుర్తొచ్చి మళ్లీ మనసు మార్చుకుంది.

నాకు మా పనిపిల్లలో నచ్చని అలవాటొకటుంది. మా అబ్బాయిలిద్దరూ భోజనానికి కూర్చోగానే, ఎదురుగ్గా నిలబడి, వాళ్లనే చూస్తూ ఉంటుంది. నేను గదమాయిస్తే కొంతసేపు అవతలికెళ్తుంది. మళ్లీ ఏదో పనున్నట్టు భోజనాల గదిలోకి వచ్చి వాళ్లకేసే చూస్తూ నిల్చుంటుంది.

పని పిల్ల స్కూలుకెళ్లడం మానేసి పగటి పూట ఎక్కువసేపు మా ఇంట్లోనే ఉండేది. ఇదేమిటని మా ఆవిణ్ని అడిగితే, మునుపు స్కూల్లో మధ్యాహ్నం భోజనం దొరికేది, ప్రస్తుతం అది బంద్ చెయ్యడంతో ఇది స్కూలుకెళ్లడం మానేసిందని చెప్పింది.

ఒకరోజు ఆఫీసునుంచి రాగానే పనిపిల్ల వరండాలో దిగులుగా కూర్చుని ఉండడం కనిపించింది. లోపలికెళ్లి మా ఆవిణ్ణి కదిపేసరికి, మండి పడింది. "ఇవాళ ఈ పిశాచి ఏం చేసిందో తెలుసా? అంత ఇష్టంగా ఉంటే ...." కోపంతో ఆవిడకు మాటలు రాలేదు.

"ఏం చేసింది. అంతపాడు పని?" అన్నాను.

"ఇంతకన్నా ఏం చెయ్యాలి? డ్రస్సింగ్ టేబుల్ ముందు నిలబడి నా క్రీము, పౌడరు మొహానికి రాసుకుని, లిప్‌స్టిక్ కూడా పూసుకుంది. దాన్ని నేను మళ్లీ ఎలా వాడను?"

నేనేం మాట్లాడలేదు.

"అందుకే చెంపలు వాయగొట్టాను!" అందావిడ.

"కొట్టావు కదా? ఇంకా కోపం తగ్గలేదా?"

"ఎలా తగ్గుతుంది? పని మానేసి బయటికి పొమ్మంటే ఏమందో తెలుసా?"

"ఏమంది?"

"ఇంకే ఇంట్లోనైనా పని మానేస్తానుగానీ, మన ఇంట్లో మాననంది!"

"ఎందుకట?"

"మిగతా ఇళ్లల్లో ఈవిడగారికి చద్దికూడే పెడతారట. మనింట్లో ఫ్రెష్‌గా వేడిగా పెడతామట!" అంటూ మా ఆవిడ వరండాలోకెళ్లింది. నేనూ వెనుకే వెళ్లాను. పనిపిల్ల వరండాలో లేదు.

◆◆◆

ఆ రోజు దీపావళి. రోజంతా

పనిపిల్ల మా ఇంట్లోనే ఉండిపోయింది. పండుగపూట ఆడవాళ్లకు బోలెడు పనులు. మా ఆవిడకు సాయం చేస్తూ అది ఇంట్లో ఉండటం ఆవిడకీ కాస్త హాయిగానే ఉంది.

సాయంకాలం అయ్యేసరికి నా పిల్లలిద్దరూ పగలంతా ఎండలో పెట్టిన టపాకాయలను తెచ్చి పంచుకోసాగారు. పెద్దవాడు తను బాంబులు ఎక్కువ తీసుకొని చిన్నవాడికి మతాబులు ఇద్దామని ప్రయత్నించాడు. కానీ చిన్నవాడు ఒప్పుకోలేదు.

పనిపిల్ల అటు తిరిగి ఇటు తిరిగి పిల్లల దగ్గరకే వచ్చి నిలబడడం నేను గమనించాను. దీపాలు పెట్టే వేళకి మా పనిపిల్ల చెల్లెలు దాన్ని పిల్చుకు పోవడానికి వచ్చింది. కానీ ఇది, "నువ్వెళ్లు! పూజ అయ్యాక ప్రసాదం తీసుకుని వస్తాను" అని దాన్ని పంపించేసింది.

రాత్రి అవుతుండగా పనిపిల్ల చెల్లెలు మళ్లీ వచ్చి, "అన్నయ్యొచ్చాడు. నిన్ను పిల్చుకురమ్మన్నాడు. పద!" అంది. అన్న వచ్చాడని వినగానే ఎందుకో దాని మొహంలో భయం అలుముకుంది లోపలికెళ్లి "వెళ్తానమ్మా" అని మా ఆవిడకు చెప్పి వెళ్ళబోతుంటే, మా ఆవిడ ఒక డబ్బాలో దానికి ఏదో ఇచ్చింది.

"ఇంకా పూజ అవలేదు. రేపొద్దున్నే రా, ప్రసాదం తీసుకుపోదువు గానీ, అన్నట్లు రేపొచ్చేప్పుడు ఈ డబ్బా తీసుకురా!" అంది.

పనిపిల్ల వరండాలోకి రాగానే దాని చెల్లెలు సైగలతో, "టపాకాయలు ఇచ్చారా?" అని అడిగింది.

"వాటికోసమేగా ఇంతసేపూ వాళ్లచుట్టూ తిరిగాను! నా దగ్గరుంటే నీకివ్వనా?" అంది పనిపిల్ల నిరాశగా.

★

పని పిల్ల స్కూలుకెళ్లడం మానేసి పగటి పూట ఎక్కువసేపు మా ఇంట్లోనే ఉండేది. ఇదేమిటని మా ఆవిణ్ని అడిగితే, మునుపు స్కూల్లో మధ్యాహ్నం భోజనం దొరికేది. ప్రస్తుతం అది బంద్ చెయ్యడంతో ఇది స్కూలుకెళ్లడం మానేసిందని చెప్పింది. ఒకరోజు ఆఫీసునుంచి రాగానే పనిపిల్ల వరండాలో దిగులుగా కూర్చుని ఉండడం కనిపించింది. లోపలికెళ్లి మా ఆవిణ్ణి కదిపేసరికి, మండి పడింది. "ఇవాళ ఈ పిశాచి ఏం చేసిందో తెలుసా? అంత ఇష్టంగా ఉంటే ...." కోపంతో ఆవిడకు మాటలు రాలేదు.
"ఏం చేసింది. అంతపాడు పని?" అన్నాను.
"ఇంతకన్నా ఏం చెయ్యాలి? డ్రస్సింగ్ టేబుల్ ముందు నిలబడి నా క్రీము, పౌడరు మొహానికి రాసుకుని, లిప్‌స్టిక్ కూడా పూసుకుంది. దాన్ని నేను మళ్లీ ఎలా వాడను?"

ముత్యాల ముచ్చట్లు



మగువలనే కాదు.. మనుసున్న ప్రతివారినీ మురిపించేవి.. మైమరిపించేవి ముత్యాలు. అమ్మాయిల అందాన్ని, నిర్మలమైన మనసుని కడిగిన ముత్యంతో పోల్చుతుంటారు. ఇలా మానవ జీవితంలో ముత్యాల ప్రస్తావన సహజంగా వచ్చేస్తుంది. ముత్యాలు లేని పెళ్లిళ్లు ... పేరంటాలు వుంటాయా! అదే విధంగా నవరత్నాలలో ముత్యాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే మిగిలిన ఎనిమిది భూమి మీద లభ్యమైతే... ఒక్క ముత్యాలకు మాత్రం సముద్రమే జన్మ స్థలం. నాటి రాణుల నుంచి నేటి ప్రముఖుల వరకు అందరూ ముత్యాల ప్రియులే. ముత్యాలను ప్రేమించడంలో సామాన్యులదీ ప్రముఖ స్థానమే. వారూ వీరూ అని లేకుండా అందర్నీ ఆకట్టుకునే ముత్యాల కబుర్లు ఈవారం మీకోసం... ఏరుకోండి మరి!

- టి. సుధాకర్

ముత్యాలు రూపొందే తీరు ఒక మహాద్భుతంలా కన్పిస్తుంది. సముద్రంలో నివసించే మొలస్కన్ జీవులు విసర్జించే కర్బన పదార్థమే ముత్యం.

ముత్యం ఇలా పుడుతుంది...

ఎక్కువగా ఆయిస్టర్లు, తక్కువగా నత్తల నుంచి ముత్యాలు ఏర్పడతాయి. దృఢమైన కవచం లోపల గుట్టుగా జీవించే ఈ జీవుల శరీరంలోకి ఓ చిన్న అన్య పదార్థం చేరినా ఒప్పుకోవు. అది ఇసుక రేణువూ కావచ్చు! శరీరంలోకి ప్రవేశించినప్పుడు బయటికి పంపిస్తూ దాని చుట్టూ కవచంలా ఆర్గొనైట్ కాంకియోలిన్ అనే కర్బన పదార్థాల్ని స్రవిస్తుంది. ఈ స్రవాన్నే నాక్రే (మదర్ ఆఫ్ పెరల్) అంటారు. ఈవిధంగా అన్య పదార్థం చేరినప్పుడల్లా మొదట ఏర్పడినదానిమీదే పొరలుపొరలుగా కర్బన పదార్థాన్ని స్రవిస్తుంటుంది. అదే ముత్యంగా రూపుదిద్దుకుంటుంది. అందుకే ముత్యం ఆకారం, లోపలకు ప్రవేశించిన అన్యపదార్థం ఆకారం, అది ఏర్పడే ప్రదేశం మీద ఆధారపడివుంటుంది. సూది మొన దగ్గరనుంచి పావురం గుడ్డు సైజు వరకూ వివిధ పరిణామాల్లో ముత్యాలు దొరుకుతాయి. సహజంగా రూపొందిన ముత్యం పొరలు పొరలుగా ఉంటుంది. మంచి ముత్యాన్ని సగానికి కోసి సూక్ష్మదర్శినితో చూస్తే ఉల్లిపాయను కోసినప్పుడు మనకు కనిపించే పొరలవంటివే ముత్యాలలో కన్పిస్తాయి.

కృత్రిమ ముత్యాలు

సహజంగా ముత్యాలు ఎలా ఏర్పడతాయో పరిశీలించిన శాస్త్రవేత్తలకు ముత్యాల తయారీ ఆసక్తికరంగా మారింది. పరిశోధకులు చేసిన రసాయన పరీక్షలు సత్ఫలితాలనిచ్చాయి. ముత్యపు చిప్పల్లో వుండే ద్రవం కాల్షియం కార్బొనేట్ అని నిర్ధారణ చేశారు. ముత్యపు చిప్పలలోకి ఈ రసాయన సమ్మేళనాన్ని ప్రవేశపెట్టి తగిన వాతావరణ పరిస్థితులను కల్పించిన జపాన్‌కు చెందిన మికామెతో కోకిచి అనే శాస్త్రవేత్త 1890లో తీవ్ర కృషి చేశారు. 17 సంవత్సరాల తర్వాత ఆయన శ్రమ ఫలించింది. ఈ కృత్రిమ ముత్యాలనే కల్చర్డ్ పెరల్స్ అని వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో 1940 నుండి కల్చర్డ్ పెరల్స్ దర్శనమిస్తున్నాయి. ఇరాక్‌లోని బస్రా ప్రాంతం నుండి తయారైన సహజ ముత్యాలు అనేక దేశాలకు దిగుమతి చేస్తారు. అందుకే సహజ ముత్యాలను బస్రాలని అంటారు. ప్రస్తుతం మార్కెట్లో వీటి ధర వందల రూపాయల నుంచి లక్షల వరకు పలుకుతోంది. ఈ బస్రా ప్రాంతంలో చమురు నిక్షేపాల కారణంగా సముద్రం కలుషితం కావడం.. ఆయిల్ బిజినెస్ పట్ల మక్కువ చూపడం.. బస్రా పరిసర ప్రాంతాల్లోని సముద్ర వాతావరణం సహకరించకపోవడం తదితర కారణాలు సహజ ముత్యాల ఉత్పాదనకు ఆవరోధమయ్యాయి. ముత్యాలలో మూడో రకం కూడా



ఉంది. వీటిని సెమి కల్చర్ ముత్యాలని అంటారు. వీటిని యంత్రం సహాయంతో తయారు చేస్తున్నారు. వీటి వెల కల్చర్ పెరల్స్ ఖరీదులో 80% ఉంటుంది. సహజ ముత్యాలలో సూర్తి, హంస, నూరి, కుడుకల్ అనే రకాలున్నాయి. కల్చర్డ్ పెరల్స్‌లో పెప్సీ, బివాకో, డ్రాప్, రైస్, సిడ్, పుష్పం, బటన్ మొదలైన ఎన్నో రకాల ముత్యాలు లభ్యమవుతున్నాయి. వీటిలో రైస్ పుష్పం రకాలకు మార్కెట్‌లో గిరాకి ఎక్కువ. అతి పెద్ద పరిమాణంలో లభించే మంచి ముత్యాన్ని పిలిగ్రీనా అని పిలుస్తారు.

ముత్యాలనగరం

హైదరాబాద్ ముత్యాల వ్యాపార కేంద్రంగా వర్ధిల్లడానికి నిజాం ఆసక్తే కారణమని తెలుస్తుంది. ఆరవ నిజాం మహబూబ్ అలీఖాన్‌కు ముత్యాలంటే అమితమైన ఇష్టం. ఆయన ప్రోద్బలంతోనే నగల వర్తకుడైన రాంధత్‌మల్‌జీ హర్యానా నుండి హైదరాబాద్‌కు వచ్చారు. తర్వాత కాలంలో అతని కుమారుడు కేదారీనాథ్ మోతీవాలే నిజాంకు సంబంధించిన ప్రత్యేక నగల



ఏవి కొనాలి?

♦ముత్యాలను కొనుగోలు చేయడంలో, సంరంక్షించుకోవడంలో కొన్ని జాగ్రత్తలు తెలుసుకోవడం, ఎంత కాలమైనా వన్నె తగ్గకుండా చూసుకోవడం ముఖ్యం. లేత గులాబి రంగు తెలుపు రంగులున్న ముత్యాలు మంచివి.

♦దృఢంగా మందంగా వెన్నెలలా మెరవాలి. చూడ్డానికి నున్నగా వుండాలి. గీతలుండకూడదు.

♦ముత్యం అసలైనదా కాదా అని తెలుసుకోవడానికి ఓ పద్ధతి ఉంది. ముత్యాన్ని మన ముందు పళ్లమీద రుద్దాలి. గరుకుగా ఉంటే స్వచ్ఛమైనదిగాను మృదువుగా ఉంటే నకిలీదిగాను గుర్తించాలి.

♦మచ్చలులేని, గుండ్రటి, మెరిసే ముత్యాలు మంచివి.

♦గులాబీ, నలుపుతోపాటు ధవళకాంతులతో మెరిసే తెలుపురంగు ముత్యాలే నాణ్యమైనవి. తక్కువ నాణ్యత కలిగిన పసుపు, గోధుమ ఛాయలున్నవి కొనకపోవడమే మంచిది.

వర్తకుడిగా నియమితులయ్యారు. చార్మినార్‌కు దగ్గరలో ఉన్న ఫత్తర్ ఘట్టిలో ప్రప్రథమంగా ఆయన ముత్యాల దుకాణాన్ని 1908లో ప్రారంభించారు. మన దేశంలోని మొట్టమొదటి ముత్యాల షాపు ఇదే. అప్పటి నుండి నగరంలో క్రమంగా ముత్యాల వర్తకుల సంఖ్య పెరగడం ప్రారంభమైంది. దేశంలో క్రమంగా ముత్యాల వర్తకుల సంఖ్య పెరగడం ప్రారంభమైంది. దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్‌లోనే పెరల్స్‌ను కొనుగోలు చేయడం ఆరంభమైంది. ముత్యాలను అందంగా అకర్షనీయంగా తయారు చేయడంలో హైదరాబాద్ నగరం ప్రత్యేక స్థానాన్ని అక్రమించింది. విదేశాల నుండి హైదరాబాద్‌కు చేరుకున్న ముడి ముత్యాలు కొత్త రూపు సంతరించుకుని దేశ విదేశాలకు చెందిన అనేక మంది ధరించే అభరణాలలో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. పెరల్స్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన హైదరాబాద్ మురిపించే ముత్యాల వ్యాపారానికి శ్రీకారం చుట్టిందని చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే అవగతమవుతుంది.

ముత్యాలకు హైదరాబాద్‌కు ఉన్న సంబంధం ఈనాటిది కాదు. రాష్ట్రంలోని భద్రాచలంలో ఏటా జరిగే శ్రీరామ కళ్యాణానికి తలంబ్రాల నిమిత్తం ముత్యాలను పంపడం అనేది గోల్కొండ నవాబ్ తానీషా కాలం నుండి అనావాయితీగా వస్తుంది. ఇప్పటికీ ఏటా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీరామ నవమి నాడు ముత్యాలు పంపించడం కొనసాగుతుంది. నవాబ్ తానీషా, శ్రీరామ కళ్యాణం కోసం తన వంతు బాధ్యతగా ముత్యాలు అందజేయడం ఆయనకున్న పరమత సహనానికే కాకుండా అప్పట్లో విరాజిల్లిన మత సామరస్యానికే ప్రతి రూపం.

ముత్యాల నగలే నేటి ఫ్యాషన్

ఇప్పుడు ముత్యాల హారాలకు అలంకరణలో ప్రత్యేక స్థానముంది. ఇంద్రధనుస్సులోని ప్రత్యేక రంగులన్నీ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం మహిళల అభిరుచులను గుర్తించిన వ్యాపారులంతా వాటిని వివిధ రకాలుగా ఉపయోగిస్తున్నారు. ఈ ముత్యాలను చెవి కమ్మలు, జుంకాలు, రింగులు, గాజులు, ముక్కు పుడకలు, రకరకాల నెక్లెస్‌లలో పొదుగుతున్నారు. కేవలం ముత్యాలనే కాకుండా పచ్చలు, కెంపులు, నీలాలు, పగడాలతో చేర్చి ఆకర్షణీయమైన ముత్యాల ఆభరణాలను తయారు చేసి మహిళల మనుసులను అకట్టుకుంటున్నారు. అందంగా ఆకర్షణీయంగా కన్పించడంతో మహిళల దృష్టి నేడు ముత్యాల నగలపైనే ఉంది. ఒకప్పుడు ముత్యాల నగలను జమీందార్లు, రాజులు మాత్రమే ధరించేవారు. బంగారం నగల డిజైన్లనే నగల తయారీలో అనుకరించడం వల్ల పేద



ఎలా భద్రపరచాలి?

♦పొడిగా ఉండే ప్రదేశాలలోనే ముత్యాలనుంచాలి.

♦కఠిన వస్తువులకు అంటే...గుచ్చుకునే, గీతలుపడే నగలకు ముత్యాలను తాకకుండా చూసుకోవాలి.

♦ముత్యాలకు వేడికీ అస్సలు పడదు. అందువల్ల వంట చేసేటప్పుడు ముత్యాలను ధరించకపోవడమే మంచిది. ఏమాత్రం వేడి తగిలినా ఇవి గోధుమ రంగులోకి మారతాయి. అలాగే పొడి వాతావరణమన్నా ముత్యాలకు పడదు. త్వరగా పొడిబారి పగుళ్లు వస్తాయి. అలా కాకుండా వుండాలంటే మెత్తటి బట్టమీద ఒక చుక్క ఆలివ్ ఆయిల్ వేసి తుడిచి ఆరిన తర్వాత మఖమల్ బట్టలో భద్రపరిస్తే ఎప్పటికీ స్వచ్ఛంగా మెరుస్తుంటాయి.

♦ముత్యాలను సుగంధ ద్రవ్యాలకు దూరంగా ఉంచాలి. లేకపోతే ముత్యాలు వర్ణాన్ని కోల్పోతాయి.

ధనిక తారతమ్యం లేకుండా అందరూ ముత్యాలంటే మోజు పడుతున్నారు.

ఏది కృత్రిమం? ఏది సహజం?

అవును మరి! ఈ అనుమానం రావడం సహజమే. మనం కొనబోయేది ప్రకృతి సహజంగా తయారైందోకాదో తెలుసుకోవడం ఎలా? దీనికీ ఒక పద్ధతి వుంది. కృత్రిమమైనవి తేలిగ్గా వుంటాయి. కాబట్టి ముత్యం కొనేటప్పుడు బరువు చూసుకోవాలి. అలాగే ముందు పళ్లమీద ముత్యాన్ని రుద్దినప్పుడు ఇసుకలా గరుకుగా తగిలితే అది సహజమైనది. అలా కాకుండా మృదువుగా వుంటే అది కృత్రిమమైనది. భూతద్దంలోంచి చూస్తే మాత్రం నున్నగా వుండాలి. అది సహజమైన ముత్యమన్నమాట.

కొసమెరుపు

చివరిగా ఒక విషయం! మనం ఎంత ధర పెట్టి కొన్నా ముత్యాలు 100 నుంచి 150 సంవత్సరాల వరకు మాత్రమే మన్నుతాయి. ఇవి కాల్షియం కార్బొనేట్‌తో తయారైనవి కాబట్టి వాతావరణ ప్రభావానికి గురై రంగును కోల్పోతాయి. ★

ఆరోగ్యం

ఆస్తమా ఆటంకం కాదు!

ఆస్తమా అంటే ఏంటి? రోగిలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి? ఏమేం పరీక్షలు చేస్తారు? వంటి వివరాలను పోయినవారం చెప్పుకున్నాం. ఈ వారం ఆస్తమా నిర్ధారణ ఎలా? నివారణోపాయాలేంటి వంటి వివరాలు తెల్సుకుందాం.

డా॥ ఆర్. సుధీంద్ర, (ఎం.డి)
చెస్ట్ ఫిజిషియన్ మరియు ఎలర్జీ స్పెషలిస్ట్
ఫోన్ : 9440285711.

ఆస్తమా నిర్ధారణ పరీక్షల వల్ల వ్యాధి తీవ్రత తెలియడంతోపాటు ఎటువంటి మందులు వాడితే మంచిదో తెలుస్తుంది. లంగ్ ఫంక్షన్ టెస్టింగ్, పీక్ ఫ్లో మీటర్...తదితర పరీక్షలతో నిర్ధారణకు రావచ్చు. గతవారం లంగ్ ఫంక్షన్ టెస్టింగ్ గురించి తెల్సుకున్నాం. మరి మిగతా విషయాలు ఈ సంచికలో చెప్పుకుందాం.

పీక్ ఫ్లో మీటర్

ఇది ఊపిరితిత్తుల సామర్థ్యం తెలుసుకొనే సులభమైన పరికరం. ఇది ఆస్తమా వ్యాధిగ్రస్తులు తమ ఇంటి వద్దనే ఉపయోగించి జబ్బు తీవ్రతను తెలుసుకొని డాక్టరును సంప్రదించడానికి ఉపయోగ పడుతుంది.

ఇతర పరీక్షలు

రక్త పరీక్షలు, ఇన్‌ఫెక్షన్, హిస్నోఫీలియా మొదలగునవి తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి.

ఆస్తమా - వైద్యం

ఆస్తమా వైద్యంలో ముఖ్యమైనది మనకు పడని వాటికి దూరంగా వుండటం, రెండవది మందులు వాడడం.

ట్రిగ్గర్స్ నివారణ

◆ఆస్తమా ప్రేరకాలను సున్నితంగా గమనించి వాటి నుండి దూరంగా వుండాలి.

ఇంటిలో దుమ్ము ధూళి లేకుండా శుభ్రంగా వుంచుకోవాలి. తడిగుడ్డతో తుడవడం కానీ, వ్యాక్యూమ్ క్లీనర్స్ ఉపయోగించడం కానీ మంచిది.

◆ కీటకాలు, బొద్దింకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

◆పెంపుడు జంతువులకు దూరంగా వుండాలి.

◆దిండు కవర్లు, దుప్పట్లు వారానికి ఒక్కసారైనా శుభ్రం చేయాలి.

◆ఎయిర్ కండిషనర్స్, కూలర్లు, ఫిల్టర్లను తరచూ శుభ్రం చేయాలి.

◆పొగ, ఘాటైనా వాసనలకు దూరంగా వుండాలి.

ఏదైనా ఒక ఆహార పదార్థాన్ని తీసుకొన్న ప్రతిసారీ ఆయాసం ఎక్కువవుతూ వుంటే దానిని తగ్గించాలి.

మందులు (ఇవి రెండు రకాలు)

1. రిలీవర్స్ : ఆస్తమా అటాక్ వచ్చినప్పుడు సత్వరం తగ్గించేవి, 4-6 గంటలు పని చేస్తాయి.

2. ప్రివెంటర్స్ : వీటిని దీర్ఘకాలం వాడటం వలన ఆస్తమా అటాక్స్ రావటాన్ని నివారించవచ్చు. వీటిని వాడటం వల్ల శ్వాసనాళాలు శాశ్వతంగా దెబ్బతినకుండా నివారించవచ్చు. అంతే కాకుండా రిలీవర్స్ వాడే అవసరాన్ని తగ్గిస్తాయి.

వాడే విధానం

ఆస్తమా వ్యాధి చికిత్సలో ప్రత్యేకత ఇన్‌హేలర్స్ అంటే నోటి ద్వారా పీల్చేమందు. జబ్బు వున్న చోటికి మందు డైరెక్టుగా వెళ్లడం వల్ల ఉపశమనం సెకన్లలో కలిగే అవకాశం వుంటుంది. (ఎలా అంటే కళ్లల్లోకి, ముక్కులోకి డ్రాప్స్ వేసుకుంటాం కదా అలా అన్నమాట.) నోటి ద్వారా మందులు తీసుకున్నా, ఇన్‌జెక్షన్ వేసుకున్నా మందు ఊపిరితిత్తులను చేరడానికి రక్తంలో కలవాలి. అందువల్ల ఊపిరి తిత్తులకు మాత్రమే కాక శరీరంలోకి, వివిధ భాగాలకు చేరడం వల్ల మందు దుష్ప్రభావాలు ఎక్కువగా వుంటాయి.

ఉదాహరణకు : రిలీవర్ మందుల వల్ల చేయి వణకడం, గుండెదడ, నీరసం మొదలగునవి. ఇన్‌హేలర్లలో మందు డైరెక్టుగా పోతుంది కాబట్టి మైక్రోగ్రాములలోనే (మిల్లీ గ్రాములో వెయ్యోవంతు) సరిపోతుంది. అదే మాత్రల్లో అయితే మిల్లీ గ్రాముల్లో డోసు వేసుకోవాలి.

ఇన్‌హేలర్స్ రెండు రకాలు

1. డ్రై పౌడర్ ఇన్‌హేలర్
2. మీటర్ డోస్ ఇన్‌హేలర్

చిన్నపిల్లలు, సరిగా పీల్చలేని వారికి ఇన్‌హేలర్ ముందు "స్పేసర్" అమర్చడం వల్ల మందును సులభంగా లోపలికి పీల్చగలుగుతారు. స్పేసర్‌కు బేబిమాస్క్ అటాచ్ చేస్తే మరీ చిన్న పిల్లలు, పురిటి పిల్లలకు కూడా ఇన్‌హేలర్స్ పనిచేస్తాయి.

నైబులైజర్ : ఆస్తమా అటాక్ తీవ్రంగా ఉన్నప్పుడు కరెంటుతో పని చేసే ఈ పరికరం ద్వారా మందులను ఊపిరితిత్తులలోకి పంపిస్తారు. ఎంత సివియర్ ఎటాక్ అయినా, ఈ పరికరం ద్వారా ఆయాసం తగ్గే అవకాశం వుంది.

సివియర్ ఆస్తమా

తీవ్రతను హెచ్చరించే సంకేతాలు:

1. అతి తక్కువగా గాలి పీల్చుకోగలగడం.
2. శ్వాసలో పిల్లికూతలు, నిద్రాభంగం
3. కాస్త వ్యాయామానికే ఆయాసం రావడం
4. ఎక్కువసార్లు రిలీవర్ మందులు (రోజుకు 3 సార్లు మించి) వాడాల్సి రావడం.

ఈ లక్షణాలుంటే వెంటనే డాక్టరును సంప్రదించాలి.

ఆస్తమా ఎటాక్ వచ్చినప్పుడు ఏం చేయాలి?

ఆస్తమా ఎటాక్‌కు గురైన వ్యక్తి ఆతృత పడకుండా (టెన్షన్ పడకుండా) వుండాలి.

నిటారుగా కూర్చొని, బిగుతుగా వున్న దుస్తులను వదులు చేసుకోవాలి.

రిలీవర్ మందు 3 లేదా 4 సార్లు పీల్చాలి. వీలైతే స్పేసర్ ద్వారా పీల్చితే మరీ మంచిది. 5 నిమిషాలు వేచి చూడండి.

తగ్గక పోతే వెంటనే డాక్టరును సంప్రదించాలి.

పిల్లల్లో ఆస్తమా వస్తే జీవితాంతం వుంటుందా?

ఆస్తమా చిన్న వయస్సులో వస్తే, వయస్సు పెరిగే కొద్దీ తగ్గే అవకాశం వుంది. 70 శాతం పిల్లలు వయస్సు పెరిగే కొద్ది ఆస్తమా నుంచి పూర్తిగా బయటపడతారు.

ఒక క్రమ పద్ధతిలో వైద్యుని పర్యవేక్షణలో మందులను దీర్ఘకాలం వాడడం వల్ల ఆస్తమాను పూర్తిగా కంట్రోల్ చేయొచ్చు. ఇలా చేయడం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరగడమే కాక ఆస్తమా లక్షణాలు తగ్గి, నిద్రాభంగం లేకపోవడం, చదువులకు, ఉద్యోగాలకు ఆటంకం లేకుండా చేయవచ్చు. సరైన వైద్య సలహాలు పాటిస్తే హాస్పటల్స్‌లో చేరే వారి అవసరాలను తగ్గించడమే కాక ఆస్తమా వల్ల కలిగే మరణాల రేటును కూడా తగ్గించొచ్చు.

క్రమపద్ధతిలో నిర్దేశించిన కాలం వరకు మందులు వాడితే ఎటువంటి ఇబ్బందీ లేకుండా, చురుకుగా, ఆరోగ్యంగా, అన్ని పనులూ మామూలుగా చేసుకోవచ్చు. ఆస్తమాతో సుఖమయ జీవనం సాధ్యమే!! ★

తోటకూర కాడలు శనగపిండి కూర

చుక్కకూర క్యారెట్ చట్నీ

తోటకూర మ్యాంగో కర్రీ

మిల్క్ బెండి

తోటకూర మ్యాంగో కర్రీ

కావలసిన పదార్థాలు

తోటకూర - 1గిన్నె
మామిడికాయ - 1
ఉల్లిపాయ ముక్కలు - 1గిన్నె
టమాటాలు - 2
పచ్చిమిర్చి - 3
పసుపు - పావు స్పూన్
కారం - 1 1/2 స్పూన్లు

తయారు చేసే విధానం

పాన్‌లో కొంచెం నూనె వేసి కాగనివ్వాలి. తర్వాత ఎండుమిర్చి, పోపు గింజలు వేయాలి. అవి వేగాక ఉల్లిపాయ, పచ్చిమిర్చి, టమాట, తోటకూర ముక్కలు వేసి కలియదిప్పాలి. ఉప్పు, కారం, పసుపు వేసి కలిపి మూత పెట్టాలి. కొద్దిగా వుడికాక మామిడికాయ ముక్కలు వేసి మూత పెట్టి ఉడకనివ్వాలి. తర్వాత గరిటెతో మెత్తగా మెదపాలి. ఇది వేడి అన్నంలో నెయ్యి వేసుకుని తింటే భలేగా వుంటుంది.

తోటకూర కాడలు శనగపిండి కూర

కావలసిన పదార్థాలు

తోటకూర ముక్కలు- 1 గిన్నె
శనగపిండి - 1 గిన్నె
ఉల్లిపాయ ముక్కలు - 1 కప్పు
పచ్చిమిర్చి - 2
ఎండుమిర్చి - 2
కరివేపాకు - 2 రెమ్మలు
పసుపు - పావు స్పూను
కారం - తగినంత
ఉప్పు - తగినంత
నూనె - 4 స్పూన్లు
పోపు దినుసులు - 1స్పూన్

తయారు చేసే విధానం

తోటకూర కాడల్ని పీచు లేకుండా సన్నగా తరిగి వుంచుకోవాలి. శనగపిండిని కొద్దిగా వేయించి పెట్టుకోవాలి. బాండీలో నూనె వేసి ఎండుమిర్చి, పోపు దినుసులు వేసి వేయించుకోవాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, తోటకూర ముక్కలు వేసి కలపాలి. కొద్దిసేపటి తర్వాత అందులో పసుపు, కారం, శనగపిండి వేసి కలిపి అవసరమైతే కొద్దిగా నీరు పోసి కలుపుతూ వుండాలి. కూర చిక్కబడ్డాక పైన కొత్తిమీర చల్లుకుంటే బావుంటుంది.

మిల్క్ బెండి

కావలసిన పదార్థాలు

బెండకాయలు - పావుకిలో
కొబ్బరి చిప్ప - 1
శనగపప్పు - 2 స్పూన్లు
దనియాలు - 2 స్పూన్లు
జీలకర్ర - 1 స్పూన్
ఉల్లిపాయ ముక్కలు - 1కప్పు
పచ్చిమిర్చి - 2
ఉప్పు - తగినంత
కారం - 1 1/2 స్పూను
పసుపు - పావు స్పూన్

తయారు చేసే విధానం

బెండకాయల్ని శుభ్రంచేసి పెద్ద ముక్కలుగా కోయాలి. కొబ్బరి చిప్పను తురిమి పాలు తీసి పెట్టుకోవాలి. జీలర్ర, మినపప్పు, శనగపప్పు, దనియాలు వేయించి పొడి చేసుకోవాలి. బెండకాయల్ని చీలికలు చేసి అందులో శనగపిండిని పెట్టుకోవాలి. బాండీలో నూనె వేసి అందులో ఈ బెండకాయలు, ఉప్పు, పసుపు, కారం వేసి కొబ్బరి పాలు పోయాలి. బెండకాయలు వుడికాక కొత్తిమీర చల్లి దించుకోవాలి. వేడివేడి అన్నంలో సూపర్‌గుంటుంది.

చుక్కకూర క్యారెట్ చట్నీ

కావలసిన పదార్థాలు

చుక్కకూర - 2 కట్టలు
క్యారెట్ -2
ఉల్లిపాయ - 1
మెంతులు - పావు స్పూన్
దనియాలు - 1స్పూన్
టమాటాలు - 3
ఎండుమిర్చి - 6
కరివేపాకు - 2 రెమ్మలు
చింతపండు - చిన్న నిమ్మకాయంత
జీలకర్ర - 1 స్పూన్
ఉప్పు - తగినంత
పసుపు - పావు స్పూన్
నూనె - 4 స్పూన్లు

తయారు చేసే విధానం

ముందుగా నూనెలో ఎండుమిర్చి, జీలకర్ర, దనియాలు వేసి వేగనివ్వాలి. తర్వాత చుక్కకూర, క్యారెట్, టమాటాలు వేసి మగ్గనివ్వాలి. చల్లారాక పసుపు, చింతపండు, ఉప్పు వేసి గ్రైండ్ చేసుకోవాలి. ఇది దోశల్లోకి, ఇడ్లీల్లోకి బాగుంటుంది.

ఎస్.సి. విద్యార్థులకు ఆన్‌లైన్

ఏ.టి.ఎమ్. సౌకర్యాలు

రాష్ట్రంలోని ఎస్.సి. విద్యార్థులకు ఎటువంటి జాప్యం జరగకుండా ఉపకారవేతనాలను అందించేందుకు ప్రభుత
ఆన్‌లైన్ ద్వారా స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది. నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలోనే ఉపకారవేతన సొ
జమయ్యే ఈ విధానం వల్ల అవకతవకలకు, అనవసర జాప్యానికి తావులేదు. గత ఐదేళ్లలో ప్రభుత్వం ఎస్
విద్యార్థులకు ఉపకారవేతనాలను గణనీయంగా పెంచింది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లతోపాటు ఫీ
రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తుండటంతో షెడ్యూల్డుకులాల విద్యార్థులందరూ ఏ ఆటంకమూ లేకుండా ఉ
విద్యను అభ్యసిస్తూ, ఉజ్వల భవితను సొంతం చేసుకునేందుకు ముందుకు సాగుతున్నారు.

డా॥కె.రోశయ్య
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

ఎస్.సి. విద్యార్థుల కోసం

- రాష్ట్రంలోని స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీ
- 2008-09లో పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు
- 2009-10 మొదటి త్రైమాసికపు పోస్ట్‌మెట్రి
- ఉపకారవేతనాలు 30% పెంపు
- హాస్టల్‌లో ఉంటూ వృత్తివిద్యా కోర్సులు
పి.జి. విద్యార్థులకు రూ॥525/-ల నుండి
రూ॥520/-లకు ఉపకార వేతనాల పెంపు
- డే స్కాలర్ ఎస్.సి విద్యార్థులలో పి.జి. ను
రూ॥429/-లకు, డిగ్రీ రెండవ, మూడవ
ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సర విద్యార్థుల

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది చేయూత -

ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలు

యింబర్స్‌మెంట్ లబ్దిదారుల్లో 5,56,000 మంది ఎస్.సి. విద్యార్థులు
విడుదల చేసిన నిధులు రూ॥471.85 కోట్లు
క్ స్కాలర్‌షిప్‌లకుగాను విడుదల చేసిన నిధులు రూ॥102.65 కోట్లు

దువుకునే విద్యార్థులకు రూ॥760/-ల నుండి రూ॥962/-లకు, రూ॥682లకు, ఇంటర్,డిగ్రీ విద్యార్థులకు రూ॥400/-ల నుండి

డి వృత్తివిద్యా కోర్సులు చదివే విద్యార్థులకు రూ॥330/-ల నుండి సంవత్సర విద్యార్థులకు రూ॥185/-ల నుండి రూ॥240/-లకు, రూ॥140/-ల నుండి రూ॥180/-లకు ఉపకార వేతనాల పెంపు

ఎస్.సి. విద్యార్థులకు ఇక బంగారు భవిత

జారీచేయువారు సమాచార, పౌరసంబంధాలశాఖ

తాజా పరిశోధనలు ఆ అనుమానాలను పటాపంచలు చేశాయి. ఇక చంద్రుడిపై నీరు ఉందని తేలిపోయింది. కాబట్టి అసలక్కడికి నీరు ఎలా చేరిందన్న దిశలో శాస్త్రజ్ఞులు తలమునకలై ఉంటారు. గ్రహ శకలాలు ఢీకొని నీరు ఏర్పడిందా, లేక చంద్రుడి పైనే రసాయన చర్యల ఫలితంగా నీరు తయారైందా అనేది తెలియాలి. ఈ విషయం తెలిస్తే చంద్రుడి ఆవిర్భావ చరిత్ర, తద్వారా సౌర కుటుంబం గురించి మరిన్ని వివరాలు తెలిసే అవకాశముంది. మన భూమి ధృవాల దగ్గరి మంచు కింద కూడా భూమి చరిత్ర తాలూకు వివరాలు లభించాయి.

చంద్రునిమీద నీరు నిజమే

- డా॥ విజయ్

గత నెల తొమ్మిదవ తేదీన నాసాకు చెందిన ఎల్‌సిఆర్‌ఒఎస్‌ఎస్ అంతరిక్ష నౌక, దాన్ని మోసుకెళ్లిన రాకెట్టును కావాలని చంద్రుడిపై 'కేబియస్' అనే భారీ గుంతలో ఢీ కొట్టించారు. అందుకు కారణం ఆ గుంతలో నీటి ఆనవాళ్లు లభిస్తాయేమోనని. అయితే అంతటి ఢీ ఓ మోస్తరు దుమ్ము దుమారం లేపింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారీ టెలిస్కోపులన్నీ ఆ పది కిలోమీటర్ల ఎత్తు ధూళినే గురిచేసి పరిశోధనలను ప్రారంభించాయి. అనుకున్నంత భారీ విస్ఫోటనం జరగలేదు. చాలా భూటెలిస్కోపులకు అసలు ఢీ ప్రభావమే కనిపించలేదు.

దాంతో చంద్రుడిపై నీటి ఆనవాళ్లను రూఢి పరచుకోవడానికి చేసిన ప్రయత్నం విఫలమనే భావించారు. కానీ శాస్త్రవేత్తలు అప్పటినుండి చేస్తున్న విశ్లేషణలు ఆసక్తికరమైన విషయాలను వెలికి తెచ్చాయి. ఢీ కొట్టిన వెంటనే లేచిన 'ధూళి' లో దాదాపు 100 కిలోల నీటి ఆవిరి, మంచు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని మొన్న 13న నాసా ప్రకటించింది.

ఎల్‌సిఆర్‌ఒఎస్‌ఎస్ చంద్రుడి ఉపరితలంపై ఢీకొట్టి కొన్ని నిమిషాలకు ముందు నమోదు చేసిన వివరాల ప్రకారం నీటి ఉనికి ఉన్నది. అయితే నీరు ఆవిరి రూపంలో ఎంతమేర ఉన్నదీ, మంచు రూపంలో ఎంత ఉన్నదీ తెలియలేదు. నిరంతరం నీడలో ఉండే చంద్రుడి ప్రదేశాల్లో నీరు ఉండే అవకాశం ఎక్కువని శాస్త్రజ్ఞుల అంచనా.

ఒక దశాబ్దానికి ముందు 'లూనార్ ప్రాస్పెక్టర్' అనే నౌక చంద్రుడి ఉపరితలంపై అధిక మోతాదులో ఉదజని(హైడ్రోజన్) ధృవాల దగ్గర కేంద్రీకృతమై ఉందని సమాచార మందించింది.

అయితే అప్పట్లో – హైడ్రోజన్ ఉండటానికీ నీరు ఉండటానికీ మధ్య సంబంధం పట్ల అనుమానాలుండేవి.

తాజా పరిశోధనలు ఆ అనుమానాలను పటాపంచలు చేశాయి. ఇక చంద్రుడిపై నీరు ఉందని తేలిపోయింది. కాబట్టి అసలక్కడికి నీరు ఎలా చేరిందన్న దిశలో శాస్త్రజ్ఞులు తలమునకలై ఉంటారు. గ్రహ శకలాలు ఢీకొని నీరు ఏర్పడిందా, లేక చంద్రుడి పైనే రసాయన చర్యల ఫలితంగా నీరు తయారైందా అనేది తెలియాలి. ఈ విషయం తెలిస్తే చంద్రుడి ఆవిర్భావ చరిత్ర, తద్వారా సౌర కుటుంబం గురించి మరిన్ని వివరాలు తెలిసే అవకాశముంది. మన భూమి ధృవాల దగ్గరి మంచు కింద కూడా భూమి చరిత్ర తాలూకు వివరాలు లభించాయి.

చంద్రుడి చీకటి గుంతల్లో బిలియన్ల సంవత్సరాల నుండి నీరు గడ్డకట్టి ఉండి ఉండవచ్చని నాసా అభిప్రాయం. ఆ గుంతల్లో ఎప్పటికీ సూర్యరశ్మి పడకపోవడం వల్ల నీటి ఆవిరి చంద్రవాతావరణంలోకి వెళ్లేవీలు లేదు. ఎల్‌సిఆర్‌ఒఎస్‌ఎస్ ఢీకొట్టిన గుంతలో ఉష్ణోగ్రత 220 డిగ్రీ సెల్సియస్! అక్కడ మరింత నీరుందని అంటున్నారు.

ఇదే ఆశతో చంద్రుడిపై 'దాడి' చేసేందుకూ కొందరు సిద్ధమౌతున్నారు. ఇ – ప్రైజ్ ఫౌండేషన్ ఛైర్మన్ పీటర్ డైమండ్స్ ముప్ఫై మిలియన్ డాలర్ల పోటీ కూడా నిర్వహిస్తున్నాడు. ప్రైవేటుగా చంద్రుడిపై తిరిగే రోవర్ల తయారీకి ఈ పోటీ.

భవిష్యత్తులో చంద్రుడిపై నివాసం వాస్తవం కావచ్చు. నీరు అక్కడ తాగడానికే కాక, దానినుండి ఆక్సిజన్, హైడ్రోజన్‌లను వేరు చేసి రాకెట్ ఇంధనంగా వాడుకోవచ్చు. అంటే భూమిపై నుండి రాకెట్ వేసుకెళ్ళి, చంద్రుడిపై ఇంధనం నింపుకుని వచ్చేయవచ్చు!

ఈ క్రమంలో 2020 కల్లా మరోసారి మానవులను చంద్రుడిపైకి పంపే ఆలోచనకు ఊతం దొరికింది. కానీ ఒబామా ప్రభుత్వం దానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుంది.

చూద్దాం! చంద్రుడిపై నీరు ఎంత వరకు మనల్ని ఆకర్షించుకుంటుందో!!

క్రైమ్ కథ

కాపాడబోయి....

- యర్నాగుల సుధాకరరావు

కరడుగట్టిన నేరస్థుడు, ఎన్నో హత్యల్లో ప్రధాన నిందితుడైన ధీరేంద్ర ఈరోజు తెల్లవారుజామున పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఒక నల్ల అంబాసిడర్ కారులో పారిపోతూ యాక్సిడెంటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉందనే వార్త టీవీ ఛానెళ్లలో వేకువ నుంచి హోరెత్తింది. నగరమంతా జనాలు ఆ విషయమే మాట్లాడుకోసాగారు. స్థానిక పత్రికలు స్పెషల్ బులెటెన్లు వేశాయి. నగరమంతా ఈ వార్తను కోడైకూయసాగింది. ఒక ఛానెల్‌వారు లైవ్‌లో ఉన్నారు. ధీరేంద్రకు వైద్యం చేసే డాక్టరుతో ఇంటర్వ్యూ ఇచ్చారు. 'రక్తం దొరకనందువల్ల చాలా ఇబ్బందిగా ఉంది. రేర్ గ్రూప్ ఓ-నెగిటివ్. ఏ బ్లడ్‌బ్యాంకుల్లోనూ లేనందువల్ల అతడికి అత్యవసరంగా చేయాల్సిన ఆపరేషన్ చేయలేక, చూస్తూ నిలబడాల్సి వచ్చింది' అని చెప్పాడు డాక్టరు.

నగరంలో రకరకాల కథనాలు. అంతటి నరహంతకుణ్ని ఎందుకు బతికించి కోర్టుబోనులో నిలిపి శిక్షించాలి? చికిత్స ఆపితే చాలదా? అని అనుకోసాగారు. కొంతమంది ఆకాశరామన్నల్లా ఈ విషయాన్ని ఫోనుల్లో పోలీసులకు చెప్పారు.

రక్తదాతలు ఎవరైనా వస్తే పోలీసులు రాకుండా చూస్తున్నారనే గాలివార్త నగరాన్ని చుట్టేసింది. సాయంత్రం అయ్యింది. ధీరేంద్ర పరిస్థితి మరింత విషమించింది. తోటి నేరగాళ్లు చాలామంది హాస్పిటల్‌కు వచ్చారు. డాక్టర్లు రక్త సేకరణలో ఉన్నారు. పోలీసులు ఎవరినీ లోపలకు రానీయకుండా కట్టుదిట్టం చేశారు. రేర్ గ్రూప్ కావడం వల్ల దొరకలేదు. లోకల్ ఛానెల్‌లో 'రక్తం కావలెను' అని ప్రకటన వెలువడింది. 'మానవత్వం లేని మనిషికి మానవత్వం ఉన్నవారు రక్తం ఇవ్వండి' అనేది దాని సారాంశం. పోలీసులు రక్తం అందకుండా చేయడంలో చాపకింద నీరులా చేయసాగారు. కానీ, అది ఎంతో సేపు చేయలేకపోయారు. రాజకీయ నాయకులు వచ్చేసి 'ఎలాగైనా ధీరేంద్ర బతకాలి' అని పట్టుబట్టారు. రక్తం కోసం గాలింపు ఉధృతి అయ్యింది. రక్తపరీక్షల కేంద్రంలో రికార్డయిన రేర్‌గ్రూప్ వారి అడ్రసులు తీసుకుని గూండాలు పరుగులు తీశారు. నగరంలో రికార్డెడ్‌గా 16 మంది మాత్రమే ఉన్నారు.

అర్ధరాత్రి అయ్యేసరికి ఆ గ్రూప్‌ది ఒక్క రక్తపుచుక్క కూడా సంపాదించలేకపోయారు. పండ్లు అమ్ముకునే సింగ్(30) ఆటోలో దిగాడు. వాడిని చూడగానే గూండాలు అదిరిపడ్డారు. అతడికి అడ్డుపడ్డారు. "ఏంరా! నీకు ఇప్పుడే ధీరేంద్రపై కక్ష సాధించాలనిపించిందా? మర్యాదగా పో! లోగడ నీకు ఒకచేయినరికి వదిలేశాడు. ఇప్పుడున్న చేతిని మేం తీసేస్తాం" అని మెడబట్టుకుని తోసేశారు.

"రేయ్ మీరు ఈరోజు ఛానెల్‌లో ఒక ప్రకటన ఇచ్చారు. అది చూశాక నా రక్తం ఇచ్చి పోదామనుకున్నాను. నాది ఓ-నెగిటివ్. పుచ్చుకోండిరా! ధీరేంద్ర చావకుండా రక్షించుకోండిరా. మానవత్వం ఉన్నవాణ్ని అని చాటుకుంటాను. ఆ మానవత్వం లేని మృగాన్ని ఎవరైనా చంపాలని అనుకుంటారు. నగరంలో సర్వత్రా వాడు చావాలని కోరుకుంటున్నారు కానీ, నేను బతికించాలనుకుంటున్నాను" అని అరిచి చెప్పాడు. వాడివైపు ఆశగా చూశారు గూండాలు. పోలీసులకు చెవుల్లో ఏదో పోసినట్టయింది. వారు కొరకొరా చూశారు.

క్షణాల్లో అతణ్ని తీసుకుని లోపలికి వెళ్లారు. రక్తం ఇవ్వడం పూర్తయింది. నీరసంగా బయటికి వచ్చాడు. గూండాలు వాణ్ని మరి వదల్లేదు. ఓ ఆటో ఎక్కించి ఇంటికి పంపేసినట్టు పోలీసుల ముందు నటించి వెనుకగా వెళ్లి ఎత్తుకుపోయారు. వాణ్ని ఒక గదిలో బంధించి తినడానికి ఖరీదైన ఆహారం ఇచ్చారు. "రేయ్ సింగ్, హాయిగా తిని ఒంటినిండా రక్తం నింపుకోరా. నువ్వే ధీరేంద్ర తేరుకునేవరకు పెద్ద దిక్కు. నీ ఆఖరి రక్తపుబొట్టు వున్నంతవరకూ జలగలా పీల్చుకోవడానికి నువ్వు కావాలి' అని చెప్పి వెళ్లిపోయారు. ట్రేలో తినుబండారాలున్నాయి. అవి చూసిన సింగ్ ఎడమ చేత్తో ఆబగా అందుకుని చికెన్, మటన్, ప్రాన్స్ తిన్నాడు. దానిమీద మత్తుగా తాగాడు. అలా బందీగా ఆ గదిలో మిగిలాడు.

ఆ తరువాత పక్షంరోజుల్లో నాలుగుసార్లు అదే రూములో బ్లడ్ తీయించి తీసుకుపోయారు. రక్తపరీక్ష నిపుణుణ్ని తెచ్చి ఆ పని చేయించసాగారు గూండాలు. ఇప్పుడు సింగుకు నీరసంతో తినబుద్ధి కావడంలేదు. వారంలో ఇన్నిసార్లు తీయడానికిలేదని రక్త నిపుణుడు నెత్తీ నోరూ కొట్టుకుని చెప్పినా వినలేదు గూండాలు. 'ఒకవేళ సింగ్ చచ్చే పరిస్థితి ఉంటే వెంటనే మొత్తం రక్తం తీసి బాటిళ్లలోకి ఎక్కిద్దాం' అని గూండాలు రక్తనిపుణునికి చెప్పిన మాటలు సింగ్ చెవులలో గింగురు మనసాగాయి. మరో వారంలో మరో నాలుగుసార్లు తీసేశారు. సింగ్ రక్తలేమితో కళ్లు తేలేశాడు.

చాలా ఖర్చుచేసి పెద్దపెద్ద డాక్టర్లు పలు శస్త్రచికిత్సలు చేసినా ధీరేంద్ర బతకలేదు. మరోవైపు సింగ్ కన్పించడంలేదని అతడి కుటుంబసభ్యుల నుంచి పోలీసులకు ఫిర్యాదు అందింది. రక్తం ఇచ్చిన తరువాత ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు చేశారు. ఎనిమిదిసార్లు బ్లడ్ బాటిళ్లు బయటి నుంచి తీసుకువచ్చారు. కనుక గూండాలే సింగును ఎత్తుకుపోయారనే అనుమానంతో వెతుకులాట ప్రారంభించారు. చివరికి నలుగురైదుగురు గూండాలను తెచ్చి ఇంటరాగేట్ చేస్తే మొత్తం గుట్టు బయటపడింది. ఒక గదిలో తిత్తితీసిన బూరలా అయిపోయి పడిఉన్న సింగును పోలీసులు బయటికి తీసుకువచ్చి హాస్పిటల్‌లో వేశారు. నాలుగునెలలు వైద్యచికిత్స పొందాక అతడు కోలుకున్నాడు.

మానవత్వం చాటాలనుకున్న సింగు శరీరంతో మానవత్వం లేని మృగాలు భయంకరంగా ఆడుకున్నాయి. రక్తం ఎక్కించి ప్రాణాలు నిలిపిన డాక్టర్లు కూడా చాలా ఆశ్చర్యపోయారు. ఇలా ఇంత రక్తం తీశాక పలు జబ్బులకు గురికావల్సి వస్తుంది. సింగ్ శరీరం బాగానే తట్టుకుంది అని అనుకున్నా అతడు ఊహించని విధంగా పక్షవాతానికి గురై కేవలం పదిరోజుల్లో కన్నుమూశాడు. అతణ్ని హింసించి చంపిన నలుగురు గూండాలపై కేసు పెట్టి వారిని కోర్టులో నిలిపారు పోలీసులు.

మానవత్వంతో ఒక మృగాన్ని రక్షించడానికి వెళ్లినందుకు ప్రాణాలు కోల్పోయిన సింగ్ కథనం ప్రజల్లో జాలి కలిగించింది.

★

ఎయిడ్స్ భూతాన్ని తరిమేద్దాం

- డా॥ నాగినేని భాస్కరరావు
యం.ఎన్.ఆర్. మెడికల్ కాలేజి మరియు ఆసుపత్రి, సంగారెడ్డి.

ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవి ఎయిడ్స్ ఒక మహమ్మారి! ఒక మరణ శాసనం!! వ్యక్తి ఆరోగ్యాన్ని, ఆర్థిక వనరులను గుల్లచేసి తద్వారా మరణానికి దారితీసి కుటుంబాన్ని, సంఘాన్ని, తద్వారా దేశాన్ని దెబ్బతీస్తోంది. వ్యాధినిరోధక శక్తి క్షీణించి, అవకాశవ్యాధుల బారినపడి న్యూనతా భావంతో పైకి చెప్పకోలేక, నివారణ మందులు సరిగాలేక/అందక పలు దేశాల్లోనూ, భారత దేశంలోనూ ఎంతో మంది మరణించారు. అనేక మంది పిల్లలకు తల్లిదండ్రుల ద్వారా వ్యాధి సోకి అల్లాడుతున్నారు. తల్లిదండ్రులు ఎయిడ్స్‌తో చనిపోవడంతో మరెందరో చిన్నారులు అనాథలయ్యారు. అయితే ఇప్పుడు హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రించుకోగల దీర్ఘకాలిక లక్షణావళి. నిరంతర ఎ.ఆర్.టి. (యాంటీ రిట్రో వైరల్ థెరపీ)తో బాధితులు సామాన్య జీవితాన్ని గడపగలుగుతున్నారు. అందరూ వారితో కలిసి భుజింపవచ్చు. కరచాలనం చేయొచ్చు. ఒకే టాయ్‌లెట్‌ను వాడొచ్చు. హెచ్ఐవి సోకకుండా జాగ్రత్తలు పాటిస్తే జనాల్లో ఎయిడ్సుకు ఓటమి తథ్యం! కుటుంబానికి, సంఘానికి, దేశానికి, ఆ వ్యాధి సోకిన వ్యక్తికి ఎంతో మేలుకలగడమూ తథ్యం!!

ఈ శతాబ్దపు సమస్య ఎయిడ్సు. శరీరంలోకి హ్యూమన్ ఇమ్యూనో డిఫిసియన్సీ వైరస్‌లు ప్రవేశించి సిడి4 కణాలపై దాడి చేసి కొద్దికాలంలో వ్యాధి నిరోధకశక్తిని నాశనంచేయడం ద్వారా వచ్చే లక్షణావళి ఎయిడ్సు. నరుడు, వానరుడు ఈ వైరస్‌కు ఆతిథ్యం ఇచ్చేవారు. హెచ్ఐవి సోకిన/ఎయిడ్సు దశకు వచ్చిన రోగులకు తగిన విధంగా వైద్యపరమైన, ఆహార, ఆదరణ పరమైన సేవ చేయనట్లయితే .... క్షయ, విరేచనాలు, చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, మెదడువాపు మొదలగు వాటి వల్ల మరణిస్తారు.

హెచ్ఐవి ఎలా సంక్రమిస్తుంది?

లైంగిక సంపర్కం ద్వారా (స్త్రీ, పురుషుల మధ్య, స్వలింగ సంపర్కం), రక్తం ద్వారా (రక్త మార్పిడి, సూది మార్గాన మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల, సూదులను అందరూ వాడడం వల్ల), తల్లి నుండి బిడ్డకు (గర్భంలో, ప్రసవ సమయంలో, పాలివ్వడం ద్వారా) హెచ్ఐవి సంక్రమిస్తుంది.

సంక్రమణం ఎక్కువ కావడానికి కారణాలు

వైరల్ లోడు ఎక్కువగా ఉండడం- ముదిరిన, చికిత్స పొందని హెచ్ఐవి ఎయిడ్సుతో బాధపడుతున్న వారివల్ల...

● హెచ్ఐవి ఎయిడ్సుతో పాటు ఇతర జబ్బులుండడం

● వైరస్‌కు గురైన వ్యక్తిలో వ్యాధి నిరోధకత తక్కువగా వుండడం లేదా జననాంగాలపై చర్మం చిట్లి ఇతర సుఖవ్యాధులుండడం

కలుషిత రక్త మార్పిడి వల్ల ఈ వ్యాధి సులభంగా సంక్రమిస్తుంది.

ఎలా వ్యాప్తి చెందదు?

దోమకాటు వల్ల, రోగితో కలిసిమెలిసి ఉంటే, కలిసి భోజనం చేస్తే, కరచాలనం చేస్తే, ఒకే టాయిలెట్‌ని వాడితే హెచ్ఐవి సోకదు.

వ్యాధి నిర్ధారణ ఎలా?

వివిధ పరీక్షలు - సిరలాజికల్, మాలిక్యులర్, బయోలాజికల్, వైరస్ పరీక్షల ద్వారా హెచ్ఐవి/ఎయిడ్సును నిర్ధారించవచ్చు. విసిసిటిసి, ఎఆర్‌టి సెంటర్లు, ప్రభుత్వ వైద్య కళాశాలలు, అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలోనూ పరీక్షలు ఉచితంగా చేస్తారు. కౌన్సిలింగ్

సౌకర్యం కూడా వుంది.

మేలుచేసే ఎ.ఆర్.టి

యాంటీ రిట్రో వైరల్ థెరపీ (ఎ.ఆర్.టి) హెచ్ఐవి వ్యాప్తిని నిరోధించి తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి తోడ్పడుతుంది. అతని/ఆమె జీవన ప్రమాణాన్ని పెంచడానికి ఉపకరిస్తుంది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే సాధారణ జీవితాన్ని గడపవచ్చు. హెచ్ఐవి/ఎయిడ్సు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం వ్యాధి దశలను బట్టి ఎ.ఆర్.టి కేంద్రాలలో రోగులకు ఉచితంగా మందులు అందించాలి.

ఎ.ఆర్.టి మందుల తరగతులు

1.న్యూక్లియోటైట్ రివర్స్ ట్రాన్స్‌క్రిప్టేజ్ ఇన్‌హిబిటర్స్

ఇవి రివర్సు ట్రాన్స్‌క్రిప్టేజ్ ఎంజైము చర్యను అడ్డుకుంటాయి. ఆర్ఎన్ఎ నుండి డిఎన్ఎ రూపాంతరం చెందకుండా అడ్డుకుంటాయి.

2.నాన్- న్యూక్లియోటైడ్ రివర్సు ట్రాన్స్‌క్రిప్టేజ్ ఇన్‌హిబిటర్స్ (ఎన్ఎన్ఆర్‌టిఐఎస్)

ఇవి రివర్సు ట్రాన్స్‌క్రిప్టేజ్ ఎంజైమును అడ్డుకుని వైరల్ ఆర్ఎన్ఎ నుండి డిఎన్ఎ తయారీని నిరోధిస్తాయి. వైరస్ పెరుగుదలను నిరోధిస్తాయి.

3.ప్రోటియేజ్ ఇన్‌హిబిటర్స్

ఇవి ప్రోటియేజ్ ఎంజైము చర్యను అడ్డుకుంటాయి. హెచ్ఐవిని పరిపక్వత చెందనివ్వవు. కాపీలను తయారు చేయలేవు.

4.ఎంట్రీ ఇన్‌హిబిటర్స్

ఇవి హెచ్ఐవిని శరీరంలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటాయి.

5.ఇంటిగ్రేజ్ ఇన్‌హిబిటర్స్

ఇవి ఎంజైము చర్యను అడ్డుకుంటాయి.

హెచ్.ఐ.వి/ఎయిడ్స్ కల్గిన వ్యక్తులు కొందరు గత ఇరవై సంవత్సరాలలో కొన్ని జాగ్రత్తలతో మామూలు జీవితాన్ని గడుపుతున్నారంటే అది ఎ.ఆర్.టి మందుల ప్రభావమే. నూటికి నూరుశాతం ఎ.ఆర్.టి మందులను వాడడంవల్లే ఇది సాధ్యమైంది. దీనికితోడు సమతుల ఆహారం, ఆరోగ్యకర అలవాట్లు, ఇంకా ఇతర జాగ్రత్తలు తీసుకుంటే వారి జీవితకాలం పెరుగుతుంది. నేడు అలాంటి వారు అనేకమంది మన మధ్య వున్నారు. వారి సిడి4 కణాల సంఖ్య సాధారణ స్థాయికి వచ్చింది. తల్లి ద్వారా హెచ్ఐవి సోకి అనాథలైన పిల్లలు 'ఆదరణ మరియు సంరక్షణ కేంద్రాల్లో' మంచి వాతావరణంలో, పుష్టికరమైన ఆహారం, ఎ.ఆర్.టి మందులు తీసుకుంటూ ఆరోగ్యంగా పెరుగుతున్నారు. తమ సిడి4 కణాలను సాధారణ స్థాయిలో కల్గివున్నారు.

నివారణ ఎలా?

ఈ కింది మార్గాల ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్‌ను నివారించవచ్చు.

వ్యాధి సోకకుండా ఒక మంచి పద్ధతి ఏమంటే లైంగిక సంపర్కం లేకుండా వుండడం.

జీవిత భాగస్వామితో విశ్వాసంగా వుండడం.

సరిగ్గా, క్రమం తప్పకుండా కండోములను వాడడం. ఇప్పుడు మహిళలు ధరించే కండోములు కూడా లభ్యమౌతున్నాయి.

మరణాన్ని వాయిదా వేస్తూ జీవితాన్ని కొనసాగించాలంటే సరైన మందులు వాడాలి. ఎ.ఆర్.టి మందులను సక్రమంగా వాడి, మందులతో పాటు పుష్టికరమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యకరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎ.ఆర్.టి మందులను నూటికి నూరు శాతం తప్పకుండా వాడాలి. దీనివల్ల హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులు తమ మిగిలిన జీవితాన్ని

ఆంధ్రపప్రదేశ్‌లో ఆ మహమ్మారి

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి హెచ్ఐవి కేసును 1987వ సంవత్సరంలో గుర్తించారు. హెచ్ఐవి/ఎయిడ్స్ ఎక్కువగా వున్న ఆరు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. 2002 సం॥ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు లక్షల హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులున్నారు. ఇది భారతదేశంలోని హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల్లో పదవశాతం. ప్రతి ఐదుగురు మగవారిలో ఒకరు సెక్స్‌ను కొనుక్కుంటున్నారు. స్త్రీ పురుషులు ఇరువురిలో 7శాతం మంది సుఖవ్యాధులతో వున్నారు. ప్రతి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎ.ఆర్.టి కేంద్రాలున్నాయి. 'ఆదరణ మరియు సంరక్షణ కేంద్రాలు' అనేకం వున్నాయి.





కొనసాగించగలుగుతారు.

నూతన మందులు

నివారణే తప్ప చికిత్సలేని హెచ్ఐవి/ఎయిడ్స్‌ను నివారించడానికి, కొన్ని అవకాశవాద వ్యాధులను నయం చేయడానికి నేడు కొన్ని మందులు అందుబాటులో వున్నాయి. అలాగే హెచ్ఐవి/ఎయిడ్స్ వల్ల వచ్చే ఉపద్రవాలను నయం చేయడానికి కొన్ని మందులను కనుగొన్నారు.

1. ఆకలికి మరియు బరువు తగ్గుదలకు - dronabinol, megestrol acetate, somatropin.

2. AZT వల్ల పాండురోగం ఉపశమనానికి epoetin alta

కొన్ని.... తేదీలు-నిజాలు

భారతదేశంలో 1985లో మొట్టమొదటి ఎయిడ్సు కేసును గుర్తించారు.

♦1981లో అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మొదటి ఎయిడ్స్ కేసును గుర్తించారు. (న్యూయార్క్‌లోని, కాలిఫోర్నియాలోని కొందరు యువకుల్లో అరుదైన న్యుమోనియా, కపోసీ సార్కోమా తీవ్ర లక్షణాలు కన్పించాయి.)

♦1982లో అమెరికా సంయుక్త రాష్ట్రాల సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ వారు తల్లి నుండి బిడ్డకు ఎయిడ్స్ వస్తుందని, అలాగే రక్త మార్పిడి (కలుషిత) వల్ల కూడా ఎయిడ్స్ వస్తుందని తెలిపారు.

♦1987లో మొదటిసారిగా ఎయిడ్స్ చికిత్సలో అజిథిమైడిన్‌ను వాడారు.

♦1986లో ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ మరణాల సంఖ్య 16,300ను దాటింది.

♦1985లో అమెరికా దేశానికి చెందిన సినీ నటుడు 'రాక్ హడ్సన్' తనకు ఎయిడ్స్ వున్నట్లు ప్రకటించాడు.

♦1991లో 'ఎర్ర రిబ్బను' ఎయిడ్స్‌పై చైతన్యం కలిగించడానికి చిహ్నంగా మారింది.

♦1992లో ఎయిడ్స్ నివారణకు వాడే న్యూక్లియోసైడ్ రివర్సు ట్రాన్స్‌క్రిప్టేజ్ ఇన్‌హిబిటర్‌ను రోగులపై వాడే ప్రయత్నాలకు అమెరికాలో అనుమతి లభించింది.

♦1993లో బాలెట్ డాన్సర్ రుడాల్ నూరెయెవ్ ఎయిడ్సు వల్ల మరణించాడు. కలుషిత రక్తమార్పిడి వల్ల హెచ్ఐవి సోకి టెన్నిస్ క్రీడాకారుడు ఆర్థర్ ఆష్ మృతి చెందాడు.

♦1994లో తల్లినుండి బిడ్డకు హెచ్ఐవి సంక్రమించకుండా చికిత్స ప్రారంభమైంది.

♦1996లో ఐక్యరాజ్యసమితి - ఐక్యరాజ్యసమితి ఎయిడ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజారోగ్య వ్యవస్థ ద్వారా యాంటీరిట్రోవైరల్ థెరపీ (ఎ.ఆర్.టి)ని మొట్టమొదటిసారిగా బ్రెజిల్ దేశంవారు ఉచితంగా ఎయిడ్స్ బాధితులకు అందించారు. నాన్ - న్యూక్లియోటైడ్ రివర్స్ ట్రాన్స్ క్రిప్టేజ్ ఇన్‌హిబిటర్ ప్రారంభం.

♦1997 - ఆఫ్రికాలో ఎనభై లక్షల మంది పిల్లలు తల్లిదండ్రులలో ఒకరిని కోల్పోయినవారున్నారు. ప్రపంచవ్యాప్తంగా 64,00,000 మంది ఎయిడ్స్ వల్ల మరణించారు. సిడిసి వారు ముద్దు పెట్టుకోవడం ద్వారా కూడా హెచ్ఐవి సంక్రమించవచ్చని మొదటి కేసు గురించి చెప్పారు.

♦1999 - థాయ్‌లాండ్‌లో హెచ్ఐవి వ్యాధి నిరోధక టీకాకు తొలి ప్రయత్నం జరిగింది.

♦2000 - యు.ఎన్.ఎ.ఐ.డి.ఎస్ మరియు డబ్ల్యు.హెచ్.ఒ సంయుక్తంగా ఐదు మందుల కంపెనీలతో హెచ్ఐవి/ఎయిడ్స్ చికిత్సకు సంబంధించి ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి.

♦2003 అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ ఎయిడ్స్ నియంత్రణకు పదిహేను బిలియన్ డాలర్ల నిధిని ప్రకటించాడు.

♦2005 - 2010కల్లా ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలని ప్రపంచ దేశాధినేతలు ప్రతిజ్ఞ చేశారు.

♦2006 చర్చి జీవితానికి ముందు హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణకు కండోముల వాడకం జరుగుతున్నదా? అని చర్చి అధికారులను పోప్ బెనిడిక్టు XVI అడిగాడు.

♦ఎయిడ్స్ వల్ల తల్లిదండ్రులు మరణిస్తే 2010కల్లా ఆఫ్రికాలో పద్దెనిమిది మిలియన్ల మంది పిల్లలు అనాథలవుతారని ఒక అంచనా.

♦2007 - ఆంధ్రప్రదేశ్‌లో ఎఆర్‌టి సెంటర్లు, వి.సి.సి.టి సెంటర్లు, పి.పి.టి.సిలు ప్రారంభించారు. హెచ్ఐవి/ ఎయిడ్స్ తీవ్రతలో తగ్గు ముఖం వచ్చింది. అనేక సురక్షిత రక్తనిధులు ఏర్పడ్డాయి.

♦2008 ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోనూ, ప్రభుత్వ వైద్యకళాశాలల్లోనూ ఎ.ఆర్.టి సెంటర్లను ఏర్పాటుచేశారు. అనేక ఆదరణ మరియు సంరక్షణ కేంద్రాలు, వి.సి.సి.టి.సిలు , హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సౌకర్యాలు పెరిగాయి.

2009 - హెచ్ఐవి/ఎయిడ్స్ రోగులకు కూడా జీవిత బీమా సౌకర్యం వర్తిస్తోంది. అవగాహనా కార్యక్రమాలు పెరిగాయి.

3. CMV retinitis, cidobovir, ganciclovir, foscavir, valganciclovir

4. Herper - Famciclovir, ganciclovir

5. wasting associated HIV - Nardrolone decanoate మొదలగునవి.

అవగాహనకోసం...

హెచ్ఐవి /ఎయిడ్సు పట్ల ప్రజల్లో మంచి అవగాహన కలగడానికి పోస్టర్లు, ప్రసంగాలు, పత్రికలు, టీవీలు, సినిమా హాళ్లలో ప్రకటనలు, ప్రచారసాధనాల వివరణలు ఇవ్వాలి. కండోముల వాడకాన్ని ప్రోత్సహించాలి. తల్లిదండ్రుల నుండి పిల్లలకు హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టగలగాలి. ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగు, టెస్టింగు సెంటర్లలో సేవలను పెంచాలి. సురక్షిత రక్తదానమును, సురక్షిత రక్త మార్పిడిని ప్రోత్సహించాలి. సూది ద్వారా మాదక ద్రవ్యాలను తీసుకునేవారిలో, మగ-మగ సెక్సు చేసేవారిలో, ఆడ సెక్సు వర్కర్లలో చైతన్యం కలిగించాలి. ఆడవారు ఉపయోగించే కండోముల వాడకాన్ని ప్రోత్సహించాలి. ఇలా నివారణ చర్యలను పెంచడం. తల్లి ద్వారా బిడ్డకు హెచ్ఐవి సోకకుండా చర్యలు చేపట్టే కేంద్రాలను పెంచాలి. వ్యాధిగ్రస్తమైన పిల్లలకు ముఖ్యంగా అనాథలైన పిల్లలకు ఎ.ఆర్.టి మందులను తగినంత మోతాదులో ఇవ్వాలి. వారికి పౌష్టికాహారం, చదువుకునే అవకాశం, ఉపాధి కల్పించే యోచన మొదలగునవి చేపట్టాలి. క్యాన్సరు సోకిన హెచ్ఐవి/ఎయిడ్సు వారికి సరైన సౌకర్యాలు కలిగించాలి. సురక్షితమైన రక్త మార్పిడికి రక్త నిధుల సంఖ్య పెంచాలి. పాఠశాలల్లో, కాలేజీల్లో హెచ్ఐవి/ఎయిడ్సు సోకిన పిల్లలకు ప్రవేశం కల్పించాలి. వారిని మంచి వాతావరణంలో పెంచాలి.

ఇలా అనేక ఇతర సౌకర్యాలు కలిగించి హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టి ఇండియాలో హెచ్ఐవి అంటు వ్యాధిని తగినంతగా నివారించాలి.

ప్రేమ, ఆదరణ

కుటుంబ సభ్యులు, సంఘసభ్యులు, ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వం హెచ్ఐవి/ఎయిడ్సు వ్యాధిగ్రస్తుల పట్ల బాధ్యత, ప్రేమ, ఆదరణ మరియు సంరక్షణను చూపాలి.

అంతిమ సేవలు

దయనీయమైన స్థితికి చేరుకున్నప్పుడు హెచ్ఐవి/ఎయిడ్సు రోగులకు ఆసుపత్రిలోగానీ, సంరక్షణ కేంద్రంలోగానీ, ఇంటివద్ద గానీ అంతిమ సేవలు చేయాలి. మానవతావాదంతో వారికి పూర్తి సహకారాలు, సహాయాలు, సంస్కారాలు చేయాలి.

రేపటి మంచి జీవితం కోసం ....

◆వ్యభిచార రహిత సమాజాన్ని తయారు చేసుకోవాలి. స్త్రీని వ్యాపార వస్తువుగా చూడడం మానాలి.

◆హెచ్ఐవి/ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలను - ప్రతి పత్రికా ప్రచురించాలి. అన్ని దూరదర్శన్ చానెళ్లు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలి. ఉదాహరణకు సప్తగిరి చానెల్లో 'మీ నేస్తం' మాదిరిగా.

◆వివాహ వ్యవస్థ పట్ల స్త్రీ, పురుషుల్లో నమ్మకం, గౌరవం పెరగాలి. వ్యక్తుల జీవనశైలి మారాలి.

✶



ఎయిడ్స్ నియంత్రణా కార్యక్రమం

ఎయిడ్స్‌ను అరికట్టడంలో 2007-2012 వరకు భారతదేశంలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణా కార్యక్రమం మూడో దశ ప్రారంభమైంది. నివారణ, సంరక్షణ, చికిత్సల ద్వారా సమీకృత వ్యూహంతో 2012కల్లా హెచ్ఐవి/ఎయిడ్స్‌ను నిలువరించి తిప్పికొట్టడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీని ప్రధానోద్దేశ్యం...

- సామాన్య జనాభాలో నివారణా చర్యలను ఎక్కువ చేయడం. ఎక్కువ సమస్యాత్మకమైన గ్రూపుల్లో నిర్దేశించిన కార్యక్రమాల ద్వారా వ్యాధిగ్రస్తతను నివారించడం.

-ఎక్కువ మంది హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులకు ఎక్కువ సంరక్షణ, చికిత్సా కార్యక్రమాల్లో కావలసిన వసతులు, మానవ వనరులను తగినంతగా పెంచి బలోపేతం చేయడం.

- రుజువు ఆధారంగా ప్రణాళిక రచన, అమలు కార్యక్రమం కోసం జాతీయస్థాయి సమర్థవంతమైన సమాచారాన్ని, పాలనా వ్యవస్థను బలోపేతం చేయడం.

చేసేద్దాం

జడబిళ్లలకోసం...



హాయ్ చిన్నారులూ! మనం రకరకాల జడక్లిప్పులు కొనుక్కుంటూ ఉంటాం. కానీ తీరా మనమేదైనా ఫంక్షన్‌కి వెళ్లే సమయానికి కావాల్సినవి దొరకవు కదూ. మరి మనమేమో ఎక్కడెక్కడో వేస్తాం. అవసరమైనప్పుడు చూసుకోవచ్చులే అనుకుంటాం. అలాకాకుండా వాటిని ఒక చోట పెట్టుకునే మార్గమొకటి చూద్దామా ఇవాళ? అదేంటంటే క్లిప్ హోల్డర్‌ను తయారు చేసుకుందాం. ఎంచక్కా దానికి మన క్లిప్పులన్నీ పెట్టుకోవచ్చు.

కావాల్సిన వస్తువులు

గట్టిఅట్ట, కత్తెర, మార్కర్, ఊలు, గమ్.

తయారుచేసే విధానం

ముందుగా గట్టిఅట్టను తీసుకుని నాలుగు అంగుళాల వ్యాసార్ధంతో వృత్తాకారంలో కత్తిరించాలి. అది క్లిప్‌హోల్డర్ మొహమన్నమాట. దాని మీద కళ్లు, ముక్కు, పెదాలు.... వంటి వాటితో చిరునవ్వులు చిందిస్తున్న బొమ్మను మార్కర్‌తో గీసుకోవాలి. 20 అంగుళాల పొడవుండేట్టు ఆ బొమ్మకు జుట్టులాగా ఊలును కత్తిరించాలి. అదే రంగు ఊలుతో వాటన్నిటినీ ఒక కొసన ముడేయాలి. తరువాత వాటిని మనం ఇంతకు ముందు తయారుచేసుకున్న బొమ్మకు జుట్టులా గమ్‌తో అంటించాలి. ఇప్పుడు దాన్ని జడలాగా అల్లుకోవచ్చు. లేదంటే అలా వదిలేయొచ్చు. ఇప్పుడు దానికి క్లిప్పులన్నీ పెట్టుకోవచ్చు. మనకెప్పుడు ఏ క్లిప్ప కావాలంటే అప్పుడు వెంటనే తీసుకోవచ్చు. వెతుక్కోవాల్సిన పనే ఉండదు. మరి చేసేస్తారుగా.

ఎక్కడున్నాయ్?

పిల్లలూ.... ఈ చిట్టడవిలో కొన్ని ప్రాణులు దాగున్నాయి. అవేంటంటే... నత్త, కప్ప, కుక్క మూడు పక్షులు, గొర్రె, ఒక చిన్న పెన్సిల్, ఆ ఇంకా ఒక ఐస్‌క్రీం కూడా వుంది. మరి అవన్నీ ఎక్కడ దాగున్నాయో కనిపెట్టి సున్నాచుట్టేస్తారా?

సంతకం

ఎ.ఆర్. రెహమాన్



జానా

రంగులద్దుదాం

పిడుగులూ... ఏ ఆకారమో తెలియని బొమ్మలకు రంగులద్దినపుడు దానికి ఒక రూపం వస్తే భలేగా వుంటుంది కదూ. కింద మీకొక మంచి బొమ్మను ఇస్తున్నాం. దానిలో • వున్న చోట లేత ఆకుపచ్చ, •• గుర్తు వున్న ప్రదేశంలో నలుపు, ... గుర్తు వున్న ప్రదేశంలో చాక్లెట్ రంగు వేసి చూడండి.



చెప్పగలరా...?!

నేస్తాలూ... ఇక్కడున్న ఆ లావాటి వ్యక్తి ఒకదొంగ. అక్కడ నిల్చున్న అమ్మాయి మెడలోని గొలుసు, చేతి ఉంగరం, సెల్‌ఫోన్ దొంగిలించాడు. అంతేకాదు ఇంకా ఆ పక్కనే వున్న అబ్బాయి సూట్‌కేస్, గిఫ్ట్ పాకెట్ కూడా కొట్టేశాడట. మరి అవన్నీ ఎక్కడ దాచాడో వెతికి వాటికి సున్నా చుట్టండే.





తేడాలేంటో...

ఫ్రెండ్స్...పై రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా వున్నా వాటిలో ఆరు తేడాలున్నాయి. అవేంటో ఒక నిమిషంలో కనిపెట్టి చెప్పేస్తారా.

డాల్ఫిన్ డాబులు

పిల్లలూ! ఇవాళ మీకు ఎంతో ఇష్టమైన జంతువు గురించి చెప్పబోతున్నాం. అదేంటో చెప్పకోండి చూద్దాం. తెలియడం లేదా! సరే మేమే చెప్తాంలెండి. అదేంటంటే డాల్ఫిన్ గురించి. ఏంటి?! డాల్ఫిన్ అనగానే టీవీలో, సినిమాలో చూసిన వాటి విన్యాసాలే గుర్తుకొస్తాయికదా! మరి ఇప్పుడు వాటి గురించి తెలుసుకుందామా?

డాల్ఫిన్ శాస్త్రీయనామం:
లాజెనోరింకస్ ఓబ్లిక్విడెన్స్



ఇవి ఎక్కువగా సముద్రాల్లో తీరం నుంచి 125 మైళ్ల దూరంలో ఉంటాయి. వాటి వీపు నల్లగా, పక్కలేమో బూడిద రంగులోనూ, పొట్ట తెల్లగానూ ఉంటుంది. వీపుపై శరీరం పొడవునా బూడిద రంగులో రెండు గీతలు ఉంటాయి. దాని వెనుక భాగం వంపు తిరిగి ఉంటుంది. అది ముడుచుకోకుండా నిటారుగా ఉంటే 2.5 మీటర్ల పొడవు వరకు వుంటుంది. దాని బరువు 180 కిలోలుంటుందట. దక్షిణ ఫసిఫిక్ తీరప్రాంతాన కొలంబియాలో తెల్లని డాల్ఫిన్లుంటాయి.

దానికి ఎన్ని పళ్లుంటాయో తెలుసా? పైదవడకి ఒక్కోపక్కా 29 పళ్లుంటాయి. కింది దవడేకేమో ఒక్కోవక్కా 32 పళ్లుంటాయి. ఇవి మాంసాహారులు. కాడ్ చేపలు, లాటర్న్ చేపలు వంటి రకరకాల సముద్రచేపలు వాటి ఆహారం.

ఇవి చక్కగా కలిసిమెలిసి ఉంటాయి. ఎక్కడికి వెళ్లినా గుంపులుగా గుంపులుగా వెళ్తాయి. ఒక్కో గుంపులో 20 నుండి వందల డాల్ఫిన్లు ఉంటాయి. ఒక్కోసారి ఈ గుంపులు వేలల్లో కూడా ఉంటాయి. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ గుంపులు ఎక్కువగా కనిపిస్తాయి. ఇవి తమ జాతి డాల్ఫిన్లతోనే కాదు ఇతర జాతి డాల్ఫిన్లతోనూ, తిమింగలాలతోనూ, సీల్స్‌తోనూ, సముద్రపు సింహాలతోనూ స్నేహం చేస్తాయి, ఆడుకుంటాయి తెలుసా? అప్పుడే పుట్టిన పిల్లలు కూడా మూడు అడుగులుంటాయి. ఇవి ఎక్కువగా ఎండాకాలంలోగానీ, చలికాలం ప్రారంభంలోగానీ పుడతాయి.

డాల్ఫిన్లు మాట్లాడుకుంటాయి కూడా! ఎలా అంటారా? రకరకాల అరుపులు, ఈలల ద్వారా. ఏదైనా ప్రమాదం రాబోతుంటే ఈ శబ్దాల ద్వారా ఒక దానికొకటి చెప్పకుంటాయి.

చూద్దామా

చారిత్రక నగరం ఓరుగల్లు


కాకతీయ కళాతోరణం


వరంగల్ కోట


వేయిస్తంభాల గుడి


రామప్ప గుడి

కాకతీయుల సామ్రాజ్యానికి కేంద్రంగా విలసిల్లిన ఓరుగల్లు చైతన్యానికి మారుపేరు. మహత్తర వీర తెలంగాణా విప్లవ రైతాంగ సాయుధపోరాటంలో ఓరుగల్లు ప్రధాన భూమిక పోషించింది. సాయుధ పోరాటంలో రాలిన తొలి విప్లవ కుసుమం దొడ్డి కొమరయ్య సహా ఎందరో అమరవీరులకు పుట్టిల్లు. అదే మన వరంగల్. దీనినే కాకతీయుల కాలంలో ఓరుగల్లుగా, ఏకశిలానగరంగా పిలుస్తుండేవారు. తెలంగాణాలో హైదరాబాద్ తర్వాత పెద్ద నగరం వరంగల్. కాకతీయుల వైభవానికి ప్రతీక అయిన ఓరుగల్లులోని ప్రకృతి రమణీయ దృశ్యాలు, సుందర పర్యాటక స్థలాలు, అద్భుత శిల్ప కళాఖండాలు, పురావస్తు కట్టడాలు ఆహ్లాదాన్ని కల్గిస్తాయి. రెండు శతాబ్దాల పాటు మహోజ్వలంగా వెలుగొందిన కాకతీయసామ్రాజ్యానికి రాజధాని ఓరుగల్లు. కాకతీయులు సరస్సులను తవ్వించి జిల్లాను సస్యశ్యామలం చేశారు. వారు నిర్మించిన రామప్ప, లక్నవరం, పాకాల సరస్సులు చూపరులను కట్టిపడేస్తాయి.

- వి. ఏకాంబర్‌రావు

తేజానికి, త్యాగానికి, చైతన్యానికి, సాహిత్య సాంస్కృతిక వికాసానికి ప్రతీకగా నిలిచింది వరంగల్. వెయ్యేళ్ల చరిత్రను తనలో నిక్షిప్తం చేసుకుంది. చారిత్రక కట్టడాలకు, అపురూపమైన శిల్ప సంపదకు, కవులకు, సాహితీవేత్తలకు ఆలవాలం. మొదటి బేతరాజు పశ్చిమ చాళుక్యుల సామంతుడిగా క్రీ.శ.1000 నుండి 1030 వరకు, ఆయన కుమారుడు పోలరాజు 1108 నుండి 1116 వరకు, 1158 నుండి 1195 వరకు రుద్రదేవుడు, 1195 నుండి 1198 వరకు ఆయన సోదరుడు మహాదేవుడు ఓరుగల్లును పాలించారు. తర్వాత రాజ్యానికి వచ్చిన రాణి రుద్రమదేవి, ఆమె పుత్రుడు ప్రతాపరుద్రుడు ఓరుగల్లును శిల్పకళలో పరిపుష్టం చేశారు.

కాకతీయుల కాలం ఒక స్వర్ణయుగం. నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవన స్థితిగతులు ప్రాచీన కట్టాడాలలో, శిల్ప కళాఖండాలలో నేటికీ స్పష్టమవుతూనే ఉన్నాయి. ఓ పక్క కత్తులు కదనరంగంలో కదం తొక్కుతుంటే మరోపక్క కవుల కలాలు సాహితీరంగంలో వీరవిహారం చేశాయి. కళాకారులు, శిల్పులు తమ ప్రతిభా పాటవాలతో చిత్ర విచిత్రాలెన్నో సృష్టించారు. సమత, మమతలతో కూడిన సమైక్య జీవన సౌందర్యం పరిఢవిల్లింది.

చారిత్రక వరంగల్ కోట

క్రీ.శ. 13వ శతాబ్దంలో గణపతిదేవుడు, ఆయన కుమార్తె రాణిరుద్రమదేవి నిర్మించిన ఈ కోట వరంగల్, హన్మకొండ పట్టణాలను కలుపుతూ 19 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. శత్రు దుర్భేద్యమైన ఏడు ప్రాకారాలు కలిగిన మట్టికోట, రాతి కోటలతో ఉన్న ఖిల్లాపై 45 బురుజులు ఉండేవి. అత్యంత పటిష్టమైన ఈ కోట మధ్యలో స్వయంభూదేవాలయం ఉంది. ఆ ఆలయ సముదాయానికి నాలుగు దిక్కులా ఇంచుమించుగా ఒకే రూపంలో ఉన్న స్వాగత తోరణాలు కాకతీయ వైభవాన్ని మౌనంగా చాటి చెబుతున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభల నుండి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో జరిగే ఉత్సవాల వరకు కాకతీయ కళాతోరణాన్ని ఒక లోగోగా ఉపయోగిస్తున్నారు. గత వైభవానికి మౌన

సాక్షిగా సితబ్‌ఖాన్ నిర్మించిన అపురూప కళాఖండం ఖుష్‌మహల్ వరంగల్ కోటకు దగ్గర్లో ఉంది. కాకతీయులు వాడిన ఆయుధాలు, పరిసర ప్రాంతాల నుండి వెలికితీసిన విగ్రహాలు ఇందులో ఉన్నాయి.

వేయిస్తంభాల ఆలయం

కాకతీయుల ప్రాభవానికి కీర్తికిరీటం సహస్రస్తంభ ఆలయం. హన్మకొండ నడిబొడ్డునున్న ఈ రుద్రేశ్వరస్వామి దేవాలయం దేశ, విదేశీ పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తుంది. విశిష్టమైన నిర్మాణ శైలితో కూడిన ఈ దేవాలయాన్ని క్రీ.శ.1138-1145 మధ్య కాలంలో రుద్రదేవుడు నిర్మించాడు. ఆలయ ప్రాంగణంలో నల్లరాతితో చెక్కిన నంది విగ్రహం నిజమైన వృషభరాజంలా జీవకళ ఉట్టిపడుతుంది.

కాకతీయుల కళా దర్పణం రామప్ప

వెంకటాపురం మండలంలోని పాలంపేట గ్రామంలో రామప్ప సరస్సు, దేవాలయం ఉన్నాయి. ఈ ఆలయం ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. కర్ణాటకలోని హలిబేడు దేవాలయం తర్వాత గొప్ప శిల్పకళా సౌందర్యం ఉన్న ఆలయం ఇదే. క్రీ.శ. 1213లో కాకతీయ రాజైన గణపతి దేవుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శాసనంలో పేర్కొన్నారు. కాటేశ్వర, కామేశ్వర, రుద్రేశ్వర ఆలయాలుండేవి. నేడు రుద్రేశ్వర ఆలయం మాత్రమే ఉంది. మిగిలిన ఆలయాలు శిథిలమయ్యాయి. తారకృతిలో ఉన్న ఆరడుగుల వేదికపై ఈ ఆలయం నిలివెత్తుగా నిలిచి ఉంటుంది. అపురూప శిల్పకళ, చక్కగా చెక్కిన రాతి స్తంభాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. గుడిపక్కనే సరస్సు ఉండడం కాకతీయుల సాంప్రదాయం. అందులో భాగంగానే రామప్ప సరస్సును తవ్వారు. ఈ సరస్సు వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తూ రైతుల ఇంట సిరుల పంటను కురిపిస్తోంది. ఆలయంలో నాగిని, సింహగర్జన, ఏనుగు, నందీశ్వరుడి శిల్పాలు ప్రత్యేక ఆకర్షణ. దేవాలయంపై ఉన్న ఇటుకలు నీటిలో తేలియాడడం విశేషం. జిల్లా కేంద్రానికి 67 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామప్ప దేవాలయానికి దేశ, విదేశాల నుండి పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకుల సౌకర్యార్థం బోటింగ్, కాటేజీలు ఏర్పాటు చేశారు.

లక్నవరం

చుట్టూ గుట్టలతో ప్రకృతి సిద్ధమైన సోయగాలతో పర్యాటకులను ఆకర్షిస్తున్న లక్నవరం ఓరుగల్లుకు మరో మణిహారం. కాకతీయుల్లో చివరి రాజైన ప్రతాపరుద్రుడు దీన్ని 12వ శతాబ్దంలో నిర్మించాడు. ఎటునుండి చూసినా సరస్సు ఒక భాగమే కనిపిస్తుంది. పొద్దువాలుతున్న సూర్యుని వెలుగులో ఎర్రని సూర్య కిరణాల ప్రతిబింబాలు నీటి అలలమాటున దాగుడు మూతలు ఆడుతుండగా చుట్టూ పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు, పక్షుల కిలకిల రావాలు, కోయిల గానాలు, జోరుగా పారుతున్న నీటి ప్రవాహాలు. గంభీరపు వాతావరణం నడుమ లక్నవరం అందాలు వర్ణనాతీతం. లక్నవరం ఆద్యంతం నయనానందకరంగా ఉంటుంది.

గణపేశ్వరాలయం

కాకతీయుల కాలంలో గణపురం ఒక పట్టణంగా పేరొందింది. కాకతీయరాజు గణపతి దేవ చక్రవర్తి క్రీ.శ 1200 నుండి 1234 వరకు గణపవరం పట్టణాన్ని నిర్మించి గణపతిరెడ్డిని సామంతునిగా చేసి పాలించినట్లు ఇక్కడ లభించిన శాసనం ద్వారా తెలుస్తోంది. గణపురంలో గణపేశ్వరాలయాన్ని కట్టించారు. గణపసముద్రం అనే చెరువును తవ్వించారు. ఈ ఆలయ గర్భగుడి ముఖద్వారం పైన చండిక త్రిముఖ, బ్రహ్మ పంచముఖ, గరుత్మంతుడు, నందీశ్వరుడు, గిరిజా కళ్యాణం, శ్రీమహా విష్ణువు ఉట్టిపడినట్లుగా చిత్రించి ఉన్నవి. దీని కింద లక్ష్మీదేవి తామరపుష్పంపై కూర్చోగా రెండువైపులా ఏనుగులు తొండాలతో సంయుక్తంగా కలశం పట్టుకుని ఉన్న ఈ విగ్రహం ఎంతో కళా నైపుణ్యంతో కాంతులీనుతుంటుంది.

నిత్యం పర్యాటకుల సందడితో అభయారణ్యం...

చుట్టూ దట్టమైన అడవి, వాగులు, వంకలు, కొండలు, పక్షుల కిలకిలారావాలు, ఆహ్లాదాన్ని పంచే పిల్లగాలులు ... పర్యాటకులను పరవశింపచేస్తాయి. జిల్లాలోనే ధాన్యాగారంగా పిలిచే పాకాల ఆయకట్టు నీరందిస్తోంది. జిల్లా కేంద్రం నుండి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ సరస్సును క్రీ.శ. 1312లో కాకతీయుల కాలంలో రెండో ప్రతాపరుద్రుడు నిర్మించినట్లు తెలుస్తోంది. అభయారణ్యంలోని సరస్సు వీటన్నింటికీ మణిహారంగా నిలుస్తోంది. సుమారు కిలో మీటరున్నర పొడవైన చెరువు కట్టవైపు కనుచూపు మేర కన్పించే దట్టమైన అడవి, మరోవైపు సరస్సు నీరు, చిలుకలగుట్టు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది.

మతసామరస్యానికి ప్రతీకలు

జిల్లాలోని డోర్నకల్ చర్చి, అన్నారం షరీఫ్, కాజీపేట దర్గా మతసామరస్యానికి ప్రతీకలుగా నిలిచాయి. రాష్ట్రంలో రెండో అతిపెద్ద చర్చిగా పేరొందిన చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియావారి చర్చి డోర్నకల్‌కు తలమానికంగా మారింది. ఈ చర్చి నిర్మాణంలో ద్రవిడ, హిందు, ముస్లిం, క్రైస్తవ శిల్ప సాంప్రదాయాలు మిళితమై ప్రకాశిస్తూ ఓరుగుల్లుకు వన్నె తెచ్చింది. తెలంగాణా ప్రాంతంలో హిందూ, ముస్లిముల ఐక్యతకు ప్రతీక అన్నారం షరీఫ్. లక్షలాదిమంది భక్తులు కొలుస్తున్న అన్నారం షరీఫ్ జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో పర్వతగిరిమండలంలో ఉంది.

★



కాజీపేట దర్గా

వేయిస్థంభాల గుడిదగ్గరి నంది



పఖాల్ సరస్సు



కుష్‌మహల్

తెలుగు తెరపై బాలలు బాల చిత్రాలు

అమీర్ ఖాన్‌లా 'తారే జమీన్ పర్' వంటి చిత్రాలు తీయకపోవచ్చు. కనీసం వీలైన మేరకైనా కమర్షియల్ పరిధిలోనే ఆరోగ్యకరమైన బాలల చిత్రాలు తీస్తే పాత్రలు సృష్టిస్తే మనం సంతోషించవచ్చు. తెలుగు సినిమాకు అలాంటి సంప్రదాయాలున్నాయని చెప్పడానికే ఈ ఉదాహరణలు. ఇప్పుడు పెరిగిన సాంకేతిక నైపుణ్యం, యానిమేషన్ ప్రక్రియ, బుల్లితెర విస్తరణ వంటివన్నీ ఉపయోగించుకుంటే బాలల చిత్రాలు బాగుపడతాయి. పిల్లల కోసం చక్కని సినిమా తీస్తే పెద్దలను కూడా థియేటర్‌కు రప్పించినట్టే. కాకపోతే వాటిని కళాత్మకంగా రూపొందించడానికి చాలా శ్రద్ధాసక్తులు కావాలి.

- తెర

రోజా రమణి

శ్రీదేవి

తులసి

సుజిత

తెలుగులో పిల్లల సినిమాలు సరిగ్గా రావడం లేదని ఈసారి బాలల చిత్రోత్సవం సందర్భంగా తీవ్రమైన చర్చ జరిగింది. నిశితమైన విమర్శలే వచ్చాయి. బాలల చిత్రోత్సవానికి ప్రతిఏటా వేదికగా వున్నది హైదరాబాదు అయినా పిల్లల చిత్రాలు రాకపోవడం నిజంగా విచిత్రమే. అయితే తీసిన వాటికి ఆదరణ లేదని నిర్మాతలు అంటున్నారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాల దగ్గర కనిపించే అక్కినేని కుటుంబరావు వంటివారు కూడా ఈసారి పెద్ద ఉత్సాహం చూపించకపోవడానికి కారణం ప్రోత్సాహలోపమే కావచ్చు. నిర్మాతల మండలి నాయకుడైన తమ్మారెడ్డి భరద్వాజ ఆఖరులో చేసిన కొన్ని వ్యాఖ్యలు దుమారమే లేపాయి. నిజానికి ఆయన వాడిన పదాల కన్నా వాటిలోని సారాంశాన్ని తీసుకుని చూస్తే పెద్ద తప్పు పట్టాల్సింది కనిపించదు.

ఇంతకూ తెలుగులో పిల్లల సినిమాలు ఎందుకని రావడం లేదు? 'తారే జమీన్ పర్' వంటివాటితో సంచలనం కలిగించిన అమీర్‌ఖాన్ మన నాయకులకు, నిర్మాతలకు ఎందుకు ఉదాహరణ కాలేకపోతున్నారు? ఈ ప్రశ్నకు సమాధానం అందరికీ తెలుసు. ఒకటి- లాభార్జనా దాహం. రెండోది భావ దారిద్ర్యం. మూడోది ముఖ్యమైంది ప్రోత్సాహం లేకపోవడం. ఎవరైనా ఎప్పుడైనా తీసినా అవి సబ్సిడీలకు చిత్రోత్సవాలకు పరిమితమై పోతున్నాయి తప్ప పిల్లలను చేరడం లేదు. అయితే పూర్తిగా పిల్లల చిత్రాలు కాకపోయినా పిల్లలను ప్రధాన పాత్రధారులుగా చేసుకుని నడిచిన గొప్ప చిత్రాలు తెలుగులో చాలానే వున్నాయి. తమ్మారెడ్డి వ్యాఖ్యానించిన తీరును బట్టి చాలామంది చిరంజీవిని ప్రస్తావించారు. కావడానికి కమర్షియల్ ఫార్ములానే అయినా ఆయన తీసిన 'పసివాడి ప్రాణం' ప్రధానంగా మాటలు రాని ఒక పిల్లవాడి చుట్టూ తిరుగుతుంది. ఘన విజయం సాధించిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' లోనూ పిల్లల సినిమా లక్షణాలున్నాయి. అంతకు ముందు బాలకృష్ణ ప్రధాన పాత్రతో వచ్చిన 'ఆదిత్య 369' కూడా పిల్లల చిత్రంగానే వుంటుంది. దానికి ముందు వచ్చిన జానపద కథ 'భైరవద్వీపం'లో మరగుజ్జులతో పిల్లలను బాగా అలరిస్తుంది. వెంకటేష్ తీసిన 'సాహసవీరుడు- సాగరకన్య'తో పాటు 'దేవీ పుత్రుడు' కూడా పిల్లల చిత్రంగానే కనిపిస్తుంది. అయితే వీటిలో చాలా భాగం మూఢనమ్మకాలు, అతీతశక్తులు వుండటం గమనించదగ్గది. త్రీ డీ సిసిమాను మళ్లీ తీసుకురావడం కోసం ప్రయత్నించిన 'చిన్నారి చేతన' లో కూడా ఇదే లక్షణం కనిపిస్తుంది.

వీటిని పక్కన పెట్టి మళ్లీ పిల్లల చిత్రాల నిర్మాణం విషయానికి వస్తే తెలుగులో ముందుగా చెప్పుకోవలసింది అక్కినేని నాగేశ్వరరావును. ఆదుర్తితో కలసి ఆయన స్థాపించిన 'చక్రవర్తి చిత్ర పతాకం'పై 'సుడిగుండాలు' చెప్పుకోదగిన తొలి ప్రయత్నం. పిల్లలే కాక యువతను కూడా దృష్టిలో పెట్టుకుని దాన్ని రూపొందించారు. పెంపకంలో లోపాలే పిల్లలను, యువతను పెడదారి పట్టిస్తున్నాయని శక్తివంతంగా వాదించారు. ఈ ప్రపంచీకరణ యుగంలో ఆ చిత్రం మరింత ప్రాధాన్యత సంతరించుకున్నట్టు కనిపిస్తుంది. అయితే అది పెద్దల సినిమాగానే నిర్మాణమైంది. 'మరో ప్రపంచం' లో యువత సమాజాన్ని బాగు చేయడానికి

పిల్లలను అపహరించి ఒక సుదూర ద్వీపంలో ఆదర్శ వాతావరణంలో పెంచడం చూస్తాం. తర్వాత వాళ్ల కోర్టులో వాదిస్తారు. మొత్తం మీద ఈ రెండు చిత్రాలు కూడా పిల్లల పెంపకం సరిగ్గా లేదని చెప్పేవే. ఎన్‌టిఆర్ 'తల్లా పెళ్లామా' పేరిట తీసిన చిత్రంలో అప్పటికి చిన్నవాడుగా వున్న హరికృష్ణ మనవడి పాత్రలో వుండి ప్రధాన సందేశాన్ని వినిపిస్తారు. ఆయనే తర్వాత కాలంలో బాలకృష్ణను ముందు పెట్టి 'తాతమ్మ కల' తీశారు గాని పెద్దగా విజయం సాధించలేదు. అరవయ్యవ దశకంలోనే బేబీ రాణి, రోజా రమణి వంటి పాపలతో పలు విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. వీటిలో బాగా ఘన విజయం సాధించింది 'లేతమనసులు'. బేబీ పద్మిని ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమాను ఏవీఎం వారు తీశారు. బేబీరాణితో 'పాప కోసం, భలేపాప' వంటి చిత్రాలు తీసి విజయం సాధించారు. రోజా రమణితో తీసిన 'భక్తప్రహ్లాద, శ్రీదేవి, సత్తెకాలపు సత్తెయ్య' వంటి చిత్రాలు కూడా ప్రేక్షకాదరణ పొందాయి. అసలు పాత సినిమాలు చాలా వాటిలో కుటుంబ కథా చిత్రాలు కావడం వల్ల పిల్లలకు బలమైన స్థానముండేది. వారిని అలరించడం వారి కోసం పాటలు ఆటలు వుండేవి. బాబాయిలు, మామయ్యలు, మామ్మలతో వారి అనుబంధాలు ప్రత్యేకాకర్షణగా వుండేవి. 'చిట్టి అమ్ములు, చిన్ని నాన్నలు, ఉడతా ఉడతా ఉఫ్' వంటి పిల్లల పాటలూ వుండేవి. మాస్టర్ ప్రభాకర్ అనే బాలనటుడు అప్పట్లో చాలా చిత్రాలకు కథానాయకుడు. వాటిలో బాగా ప్రసిద్ధమైంది బాపు రమణలు రూపొందించిన 'బాలరాజు కథ'. మహాబలిపురంలో గైడ్‌గా వుండే బాలరాజు ఆటపాటలతో ఆ కథ హాయిగా సాగుతుంది. బాలరాజు దుర్యోధనుడుగా తీసిన 'బాలభారతం' కూడా పెద్ద హిట్. మొత్తం భారతాన్ని కౌరవ పాండవులు బాల్యదశ వరకూ చూపించే అందాల సంగీత భరిత చిత్రం ఇది. ఇదే కోవలో ఎంఎస్‌రెడ్డి తర్వాత 'రామాయణం' తీసి జూనియర్ ఎన్టీఆర్‌ను పరిచయం చేశారు. బాల తారల్లో పెద్దవారయ్యాక కూడా రాణించిన వ్యక్తి శ్రీదేవి. 'బూచాడమ్మా బూచాడు...' అంటూ 'బడిపంతులు'లో పాడిన ఆమె తర్వాత కాలంలో అఖిల భారత అగ్రనటిగా వెలుగొందింది. కమల్‌హాసన్ కూడా ఈ కోవలో వారే. పిల్లలకు సరైన పాత్రలు, కథలు ఇస్తే చిన్నతనంలోనే ఎంతగా ప్రకాశిస్తారనడానికి వీరే ఉదాహరణలు.

విశ్వనాథ్ చిత్రాల్లో కూడా పిల్లలకు సముచిత స్థానముంటుంది. చాలాసార్లు ఆయన కథను పిల్లల పరంగా చెప్పడం మొదలెడతాడు. 'శంకరాభరణం, సాగరసంగమం, స్వయంకృషి' వగైరా అనేక చిత్రాల్లో దీన్ని గమనించవచ్చు. 'స్వాతికిరణం' అయితే అచ్చంగా బాలగాయకుడి కథ. పైన ప్రస్తావించిన 'భైరవద్వీపం, ఆదిత్య 369, అపూర్వ సహోదరులు' వంటి చిత్రాలందించిన సింగీతం శ్రీనివాసరావును మరింత ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కె.కృష్ణారెడ్డి తీసిన 'మాయలోడు' బాలల చిత్రాలకు చక్కటి ఉదాహరణ. పెద్దలను కూడా మురిపించేంత మనోహరంగా సాగుతుంది. అలాగే 'రాజేంద్రుడు-గజేంద్రుడు, కొబ్బరి బొండాం' కూడా. హాస్యచిత్రాలు ఆరోగ్యకరంగా తీస్తే పిల్లలు ఇట్టే ఆకర్షితులవుతారు.

పిల్లల చిత్రాల విషయంలో అక్కినేని కుటుంబరావు నిరంతరంగా పనిచేస్తున్నారు. ఆయన తీసిన 'భద్రం కొడుకో' పూర్తి స్థాయిలో అచ్చమైన బాలల చిత్రం. అదే సమయంలో మిగిలిన వాటిలా వినోద ప్రధానం గాక సమస్యాత్మకం కూడా. ఆయనే తర్వాత 'గులాబీలు, అమూల్యం' వంటి చిత్రాలందించారు. తరుణ్ బాలనటుడుగా వేసిన 'తేజ' తర్వాత ఆయన హీరో కావడానికి బాట వేసింది. గుణం గణ్నం రాజు తీసిన 'లిటిల్ సోల్జర్స్', నాగార్జున బుల్లి కొడుకుతో తీసిన 'సిసింద్రీ' బాలల చిత్రాలే.

ఇలా చెప్పుకోవలసినవి ఇంకా చాలా వున్నాయి గాని ఆధునిక అర్థంలో ఇవన్నీ పిల్లల చిత్రాలు కాకపోవచ్చు. ఎందుకంటే ఏదో ఫార్ములాలో పిల్లలను ఇమిడ్చి తీసి సెంటిమెంటుకోసం వాడుకోవడం వేరు. పిల్లల కోసం తీసే సినిమాలు లేదా వారి పాత్రలు తప్పనిసరిగా వారి అవగాహనను, చైతన్యాన్ని, సాహసాన్ని, జ్ఞానాన్ని పెంచేవిగానూ మానవీయ విలువలను చాటేవిగానూ వుండాలి. ఇందుకు భిన్నంగా చాలా చిత్రాల్లో పిల్లల పాత్రలను కూడా అశ్లీల సంభాషణలకు, ముదురు వేషాలకు వాడుకోవడం జుగుప్స కలిగిస్తుంది. వారితో ప్రేమ పాఠాలు చెప్పించడం, శృంగార స్వప్నాలు తెప్పించడం, క్రూరత్వాన్ని ప్రదర్శించడం అనుమతించరాని విషయం. అయితే దురదృష్టవశాత్తూ ప్రముఖులకు సంబంధించిన వాటిలోనూ ఆ లక్షణాలు కనిపిస్తుంటాయి. మూఢనమ్మకాలకు కూడా బాల పాత్రలను బలిచేస్తుంటారు.

అమీర్ ఖాన్‌లా 'తారే జమీన్ పర్' వంటి చిత్రాలు తీయకపోవచ్చు. కనీసం వీలైన మేరకైనా కమర్షియల్ పరిధిలోనే ఆరోగ్యకరమైన బాలల చిత్రాలు తీస్తే పాత్రలు సృష్టిస్తే మనం సంతోషించవచ్చు. తెలుగు సినిమాకు అలాంటి సంప్రదాయాలున్నాయని చెప్పడానికే ఈ ఉదాహరణలు. ఇప్పుడు పెరిగిన సాంకేతిక నైపుణ్యం, యానిమేషన్ ప్రక్రియ, బుల్లితెర విస్తరణ వంటివన్నీ ఉపయోగించుకుంటే బాలల చిత్రాలు బాగుపడతాయి. పిల్లల కోసం చక్కని సినిమా తీస్తే పెద్దలను కూడా థియేటర్‌కు రప్పించినట్టే. కాకపోతే వాటిని కళాత్మకంగా రూపొందించడానికి చాలా శ్రద్ధాసక్తులు కావాలి. ★

వికాసం

"నువ్వు ఇంటి పనీ, పిల్లలూ అనుకుంటూ ఉంటే నీ భార్య నిన్ను లెక్క చేయదు. ఆమె నీ మీద అధికారం చెలాయిస్తుంది. సమాజం కూడా నీకు ... భర్త అని ముద్ర వేస్తుంది. నీ పిల్లలూ నిన్ను లెక్క చేయరు"

ఆ పని ఆమెదేనా!

- సంధ్య

విజయ్, ప్రియ ఒకే కాలేజీలో చదువుకున్నారు. స్నేహం ప్రేమగా మారి... పెళ్లి చేసుకున్నారు. వారి దాంపత్యజీవితం కూడా చాలా సాఫీగా సాగిపోతూ ఉంది. అలాగే తమ తమ ఉద్యోగాల్లోనూ విజయాలు సాధిస్తున్నారు. అయితే పాప పుట్టడంతో ప్రియ ఉద్యోగానికి బ్రేక్ పడింది. బిడ్డకు పాలివ్వడం ఆపేశాక తిరిగి ఉద్యోగం చేయడం మొదలు పెట్టింది. కానీ రెండో కాన్పు తర్వాత పిల్లల ఆలనాపాలనా చూసుకోవడం కోసం ఉద్యోగం మానేసింది. తర్వాత కొద్ది కాలానికి ఏవో కారణాల వల్ల విజయ్ తను చేస్తున్న ఉద్యోగం మానేసి వేరే సంస్థలో చేరాడు. అయితే ఆ ఉద్యోగంలో ఇంతకుముందులాగా ఎదగలేకపోయాడు. కుటుంబం గడవడం కొంచెం ఇబ్బందిగా ఉండడంతో ప్రియ మళ్లీ ఉద్యోగంలో చేరాలనుకుంది. పేపర్ యాడ్ చూసి రెండుమూడు ఉద్యోగాలకు దరఖాస్తు పెట్టుకుంది. అందులో ఒక దానికి ఇంటర్వ్యూకి రమ్మని లెటర్ వచ్చింది ప్రియకు. అందులో ఆమె ఎంపికవడంతో ఉద్యోగం వచ్చింది. చేరిన కొంతకాలానికే ఒక్కో మెట్టుగా పైకి ఎదుగుతూ మంచి స్థాయికి చేరుకుంది. దాంతో ఆమె ఆఫీసు పనిలో బిజీబిజీగా ఉండేది. తనకు ఇంటిపని చూసుకోవడానికి కుదిరేది కాదు. దాన్ని అర్థం చేసుకున్న విజయ్ తన పనితో పాటు ఇంటిపని కూడా చూసేవాడు.

ఒక రోజు ప్రియ తన ఆఫీసు పని మీద వేరే ఊరు వెళ్లాల్సివచ్చింది. ఇంట్లో పనుంది. పైగా పిల్లలు ఒంటరిగా ఉన్నారు. అందుకని విజయ్ త్వరగా ఇంటికి వెళ్లబోతుండగా స్నేహితుడు వినీత్ ఎదురొచ్చాడు.

"విజయ్ ఏంటివాళ ఇంత త్వరగా వెళ్తున్నావు?" అని అడిగాడు.

"ప్రియ ఆఫీసు పని మీద ఊరెళ్లిందిరా. నేను త్వరగా వెళ్లి పిల్లలను చూసుకోవాలి" అంటాడు విజయ్.

"అదేంటి! నువ్వు పిల్లలను చూసుకోవడమేంటి? ఇలా చేస్తూ ఉంటే కొంతకాలానికి ఇంటిపనికే పరిమితమవుతావు"

"అలా అంటావేంటి! ఇంటి పనులు చేయడంలో తప్పేముంది. ఇంటి పనులు చూసుకోవడం నా బాధ్యత కాదా?"

దానికి వినీత్ "నువ్వు ఇంటి పనీ, పిల్లలూ అనుకుంటూ ఉంటే నీ భార్య నిన్ను లెక్క చేయదు. ఆమె నీ మీద అధికారం చెలాయిస్తుంది. సమాజం కూడా నీకు ... భర్త అని ముద్ర వేస్తుంది. నీ పిల్లలూ నిన్ను లెక్క చేయరు" అని మగవాళ్లసలు ఇంటిపనే చేయగూడదన్నట్లు చెప్తాడు.

"ఇంట్లో పనులు చేయడం వల్ల పిల్లలు నన్ను లెక్కచేయరనుకోవడం పొరపాటు. పైగా భార్య విజయాన్ని గౌరవించి, ఆమె అభివృద్ధిని చూసి గర్వించడంలో తప్పేముంది? అలా చేయడంవల్ల భార్యాపిల్లల మనసులో నా పట్ల గౌరవం పెరుగుతుంది తప్ప తరగదు. తల్లి ఆఫీసు పనిలో ఉన్నప్పుడు తండ్రి వారికోసం సమయాన్ని కేటాయిస్తే నిజానికి వారు సంతోషిస్తారు. ఎవరో ఒకరైనా తమను జాగ్రత్తగా చూసుకుంటున్నందుకు, తమ కోసం సమయాన్ని వెచ్చిస్తున్నందుకు చాలా ఆనందంగా ఫీలవుతారు" అంటాడు కూల్‌గా.

"నాకు అనిపించింది నేను చెప్పాను. ఆనక నీ ఇష్టం! నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటారనే అలా చెప్పాగానీ... నా మనసులో మరేం లేదు" అంటాడు వినీత్ మరోసారి.

"ఎవరో ఏదో అనుకుంటారని మేమెందుకు బాధపడాలి. మా కుటుంబం సంతోషంగా ఉండడం కోసం ఒకరి అభిప్రాయాలను ఒకరం గౌరవించుకుంటున్నాం. నిజానికి ఒకసారి నేనే చెప్పాను. ఒకరు వృత్తి పట్ల, దానిలో ఎదుగుదల పట్ల దృష్టి పెట్టాలి. మరొకరు కుటుంబ బాధ్యతలు చూసుకోవాలి. అప్పుడే ఇటు ఆర్థికంగానూ అటు కుటుంబపరంగానూ సంతోషకరమైన జీవితాన్ని గడపగలం. అయితే మా విషయంలో ప్రియకే ఉద్యోగ రీత్యా మంచి అవకాశం లభించింది. అందుకే నేను కుటుంబాన్ని సమన్వయపరిచే పనిని తీసుకున్నాను. అందులో తప్పేముంది"

"కానీ విజయ్ నీ భార్య ఎంత విజయం సాధించినా నీ విజయాన్ని బట్టే కదా సమాజం నిన్ను గౌరవించేది"

"విజయమనేదాన్ని ఒక్కొక్కరు ఒక్కోలాగా తీసుకుంటారు. నా దృష్టిలో విజయమంటే ఒక మంచి కుటుంబాన్ని తీర్చిదిద్దుకోవడానికి భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరు సహకరించుకోవడమే. భార్యాభర్తల్లో ఎవరు విజయం సాధించారనేది ముఖ్యం కాదు. వారిద్దరూ తమ కుటుంబాన్ని చక్కదిద్దుకోవడంలో ఎంత విజయం సాధించారనేదే ముఖ్యం."

"కానీ విజయ్! వంట చేస్తూ, ఇంటి పనులు చేస్తూ ఉంటే నీకు చిన్నతనం అనిపించదా? నీ ఆత్మాభిమానం దెబ్బతినదా?"

"ఇతరుల విజయాన్ని ఒప్పుకోలేని వాళ్లకే ఆత్మాభిమానం దెబ్బ తింటుంది. రెండు వృత్తులు ఒకేవేగంతో అభివృద్ధి చెందవు. అయినా మన కొలీగ్స్ మంచి పేరు తెచ్చుకుని ప్రమోషన్ కొట్టేయడం లేదా? వారితో మనం కలిసి పనిచేయట్లేదా? మనం ఆఫీసులో టీమ్‌వర్క్ చేసినట్లే ఇంట్లో ఎందుకు చేయలేం? నేను ప్రియ అభివృద్ధిని ఎంతగా గౌరవిస్తానో, అదేవిధంగా మా పిల్లలను పెంచడంలో నన్ను ప్రియ అంతగా గౌరవిస్తుంది. అలా పరస్పరం సహకరించుకుంటూ పోతే ఆత్మాభిమానం దెబ్బతినే ప్రశ్నే ఉండదు. నిజానికి జీవిత భాగస్వామిని గౌరవించినప్పుడే వారు ప్రశాంతంగా ఉంటారు. మనం వారి అభిప్రాయాన్ని ఒప్పుకున్నప్పుడే మనం ప్రశాంతంగా ఉంటాం. ఎక్కడైతే పరస్పర గౌరవం, ప్రేమ ఉంటాయో అక్కడే సంతోషం, అభివృద్ధి ఉంటాయి".

"విజయ్! నేను మామూలుగా నిన్ను ఒక ప్రశ్న అడగడం వల్ల నాకు చాలా విషయాలు చెప్పావు. కుటుంబం సంతోషంగా, ఆనందంగా ఉండి అభివృద్ధి చెందడానికి భార్యాభర్తల పరస్పర సహకారం ఎంత అవసరమో తెలిపావు" అనుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు వినీత్.

"తన భాగస్వామితో పోటీ పడితే తనకు మాత్రమే విజయం కలుగుతుంది. కానీ అవసరాన్నిబట్టి భాగస్వామికి సహకరిస్తే భార్యాభర్తలిద్దరూ విజయం సాధించడమేకాదు, మొత్తం కుటుంబానికే విజయం చేకూరుతుంది. పెళ్లి అనేది ఒకరు ఆడుకునే ఆట కాదు. ఇద్దరూ ఆడుకునే ఆట. అందులో ఓడితే ఇద్దరూ ఓడిపోతారు. గెలిస్తే ఇద్దరూ గెలుస్తారు" మనసులో అనుకుంటూ విజయ్ గర్వంగా నవ్వుకుంటూ ఇంటికి వెళ్తాడు.

★

'చిన్న' తల్లి

మాతృత్వం అంటే ఇదే మరి! తన ప్రాణానికి ప్రమాదమని తెలిసినా పిల్లల్ని కనడానికి సిద్ధమైంది. అది కూడా మూడవ సారి. ఆ తల్లి పేరు స్టేసీ హెరాల్డ్. ఆమె ఎత్తు 2 అడుగుల 4 అంగుళాలే. అంత చిన్నగా వున్న ఆమె గర్భం దాలిస్తే ప్రాణాపాయమని వైద్యులు హెచ్చరించినా లెక్కచేయలేదు. మరో నాలుగు నెలల్లో మూడో బిడ్డకు జన్మనివ్వనుంది.

ఇంతకూ ఆమె ఎందుకంత పొట్టిగా వుంది? ఆమె సమస్య ఏంటి? అన్నప్రశ్నలు మీ బుర్ర తొలిచేస్తున్నాయి కదూ! స్టేసీ ఓస్టియోజెనెసిస్ అనే ఎముకల వ్యాధితో బాధపడుతోంది. ఎముకలు పెళుసుబారి, ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో ఆమె ఎదగలేదు. వీల్ చైర్‌లోనే అన్నీ. ప్రస్తుతం ఆమె ఎంత పొడవుందో అంత వెడల్పుంది. దాంతో అన్ని పనులూ తన భర్తే చూసుకుంటున్నాడు. కనీసం తన రెండో కూతుర్ని దగ్గరికి తీసుకోవడానికి కూడా కుదరడం లేదు.

మరి స్టేసీ భర్త ఓ మూడడుగులుంటాడులే అనుకుంటే పొరపాటే! ఎందుకంటే ఆయన ఎత్తు ఐదడుగుల తొమ్మిదంగుళాలు. అ...వు...నా...! వీరిరువురికి జోడీ ఎలా కుదిరింది అనుకుంటున్నారా? 2000 సంవత్సరంలో ఆమె ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేసేది. అప్పుడు వారిరువురికి పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారి 2004లో పెళ్లి చేసుకున్నారు.

ఆమె చిన్న పొట్టలో బిడ్డ పెరగడంవల్ల అవయవాలన్నీ అదిమినట్టై శ్వాస తీసుకోవడం కష్టమౌతుందని వైద్యులు హెచ్చరించారు. అప్పుడు స్టేసీ ఏమందో తెల్సా! "పిల్లలు లేకపోతే నేను గుండె పగిలి చచ్చిపోతాను" అని. "ఇలాగైతే నువ్వు బతకవు" అని తల్లి కూడా నచ్చజెప్పడానికి ప్రయత్నించింది. అయినా ఆమె వినలేదు. "నేను ఇప్పటివరకూ బతకడమే ఒక అద్భుతం. ఇది కూడా మరో అద్భుతమెందుకు కాకూడదు?" అన్నది మొండిగా.

వారి మొదటి పాప 2006లో జన్మించింది. 28 వారాలకే వైద్యులు స్టేసీకి ఆపరేషన్ చేసి బిడ్డను బయటికి తీశారు. తన పేరు కతేరి. ఆమెకు అన్ని అవయవాల పెరుగుదల బాగానే ఉంది. కాకపోతే వాళ్లమ్మకులాగా గుండెలో చిన్న లోపముండడంతో ఆమె సాధారణ ఎత్తుకు ఎదగలేదు. రెండో కూతురు మకాయా ఇప్పుడే తన తల్లి ఎత్తుకి సగానికి పైగా ఉంది. రెండోసారి గర్భందాల్చినప్పుడు స్టేసీ కొన్ని వారాల వరకూ ఏమీ చేయలేకపోయింది.

ప్రస్తుతం మూడో బిడ్డకు జన్మనివ్వడానికి సిద్ధమౌతున్న స్టేసీ టాయిలెట్‌కి వెళ్లడానికి ఒకరి సహాయం తీసుకోవలసి వస్తోందట. రెండో పాప ఆలనాపాలనా తన భర్త చూసుకుంటున్నాడు. దీంతో వాళ్లిద్దరికీ చాలా కష్టంగా ఉంది. అయినా పిల్లల కోసం ఇవన్నీ భరించడం తేలికే అంటోంది స్టేసీ.

ఓ పిట్ట కథ

- రంగనాథ రామచంద్రరావు

ఒకానొకప్పుడు నల్లమల అడవుల్లో ఓ వల్లంకి పిట్ట ఉండేది. అది ప్రతిరోజూ చేల వెంబడి తిరుగుతూ గింజలు తిని పొట్ట నింపుకునేది.

ఒకరోజు అది పంటచేలలో పడి కనిపించిన కందులు, జొన్నలు, సజ్జలు కడుపారతింది. అటు తరువాత కొన్ని గింజల్ని ఏరుకుని మూట కట్టుకుని ఊరి చివర ఉన్న ముసలమ్మ ఇంటికి వచ్చింది. ఆమెను అడిగి విసుర్రాయితో గింజల్ని విసిరింది. ఆ పిండితో రొట్టె తయారు చేసుకుంది. అయితే అప్పటికే కడుపునిండా గింజలు తినివుండటంతో దానికి ఆకలి కాలేదు. దాంతో రొట్టె తీసుకొని నూలు వొడికే ముసలమ్మ దగ్గరికెళ్లి "నేను అలా అలా షికారుకు వెళ్లొస్తాను. అప్పటిదాకా ఈ రొట్టెను నీ దగ్గర దాచిపెట్టు" అంది.

"అలాగే" అంది ములసమ్మ.

పిట్ట గాలిలో పల్టీలు కొడుతూ ముందుకు సాగింది.

కొద్దిసేపటి తరువాత ముసలమ్మకు ఆకలేసింది. పిట్ట ఇచ్చిన రొట్టెను తినేసింది.

సాయంత్రం వల్లంకిపిట్ట తిరిగొచ్చి "అవ్వా! నా రొట్టె ఇవ్వు" అంది.

"అయ్యో! నాకు ఆకలేస్తే రొట్టె తినేశాను నరేలే! నీకు రొట్టెకు బదులుగా నేను వొడుకుతున్న నూలు ఇస్తాను" అంది.

పిట్ట అవ్వ ఇచ్చిన నూలు కండెను తీసుకుని ఇంటికి బయలుదేరింది.

మరుసటి రోజు ఆహారం కోసం పిట్ట బయటికి వెలుతూ బట్టలు నేసే నేతన్న దగ్గరికి వెళ్లి "నేతన్నా! నేతన్నా! నేను పని మీద వెలుతున్నాను. నేను తిరిగి వచ్చేవరకు ఈ నూలుకండెను నీ దగ్గర ఉంచు" అని అక్కడి నుంచి వెళ్లిపోయింది.

నేతన్న బట్టలు నేస్తూ నూలు తక్కువ కావటంతో పిట్ట ఇచ్చిన నూలును వాడాడు. పిట్ట సాయంత్రం తిరిగి వచ్చి తన నూలుకండెను ఇవ్వమంది.

"అయ్యో! పిట్టా! బట్టకు నూలు తక్కువైతే నీ నూలును నేను వాడుకున్నాను. నీకు నూలుకు బదులుగా నేను నేసిన చక్కని పంచెను ఇస్తాను తీసుకో" అంటూ పంచె ఇచ్చాడు.

పిట్ట పంచెను తీసుకుని ఇంటికి మరలింది.

మరుసటి రోజు పిట్ట ఆహారం కోసం బయలుదేరుతూ దారిలో ఓ గుర్రాల కాపరికి 'పంచె' దాయమని ఇచ్చింది. ఆ రోజు అతడింటికి బంధువు వచ్చాడు. హఠాత్తుగా వచ్చిన బంధువుకు ఏమివ్వాలో తోచక పిట్ట ఇచ్చిన పంచెను ఇచ్చి సాగనంపాడు.

సాయంత్రం పిట్ట వచ్చి తన పంచె ఇమ్మంది.

"అయ్యో! నీ పంచెను నా బంధువుకి ఇవ్వాల్సి వచ్చింది. పంచెకు బదులుగా గుర్రాన్ని తీసుకుపో" అన్నాడు గుర్రాల కాపరి.

పిట్ట గుర్రాన్ని తోలుకుంటూ వెళుతూ ఓ మావటి వాడికి అప్పగించి ఇంటికిపోయింది. మావటివాడు తన ఇంటికి వచ్చిన అల్లుడికి గుర్రాన్ని బహుమతిగా ఇచ్చి పంపాడు.

మరుసటి రోజు పిట్ట వచ్చి మావటిని గుర్రాన్నివ్వమని అడిగింది.

"అయ్యో! నీ గుర్రాన్ని నా అల్లుడు తీసుకున్నాడు. గుర్రానికి బదులుగా ఇదిగో ఈ చిట్టి ఏనుగును తీసుకుపో" అన్నాడు మావటి.

ఏనుగును వెంటబెట్టుకుని పిట్ట షావుకారు దగ్గరికి వెళ్ళింది. ఏనుగును షావుకారుకు అప్పగించి ఆహారం కోసం బయలుదేరింది. అదే రోజు షావుకారు కూతురిని అత్తవారింటికి పంపుతూ ఏనుగును కానుకగా పంపాడు.

సాయంత్రం పిట్ట షావుకారు దగ్గరికెళ్ళింది.

"అయ్యో! నీ ఏనుగును నా కూతురికి కానుకగా ఇచ్చాను. దానికి బదులుగా వంద వరహాలు ఇస్తాను తీసుకో" అంటూ వరహాల సంచి ఇచ్చాడు.

పిట్ట వరహాల సంచి తీసుకుని ఇంటికి వెళుతూ పిడకలు కొట్టే ఆమెకు ఇచ్చి దాయమంది. ఆమె వరహాలు ఖర్చు చేసేసింది.

మరుసటి రోజు పిట్ట వచ్చి అడిగేసరికి "వరహాలకు బదులుగా గంపెడు పిడకలు తీసుకో" అంటూ గంపెడు పిడకలు ఇచ్చింది. పిట్ట నెత్తి మీద గంపను మోస్తూ ఊర్లో ఉన్నపేదరాసి పెద్దమ్మ దగ్గరికి వచ్చింది. పెద్దమ్మ "అట్లు" పోస్తోంది. "పెద్దమ్మా ఈ పిడకల గంపను నీ ఇంట్లో పెడుతున్నాను. రేపొచ్చి తీసుకుంటా" అని ఇంటికి వెళ్ళింది.

పెద్దమ్మ అట్లు వేస్తూ పొయ్యిలోకి పిడకలు తక్కువైతే పిట్ట పెట్టిపోయిన పిడకలను వాడుకుంది. మరుసటి రోజు పిట్ట వచ్చి పిడకలు అడిగింది.

"అయ్యో! రాత్రి నా దగ్గరున్న పిడకలు అయిపోవటంతో నీ పిడకలను వాడుకున్నాను. పిడకలకు బదులుగా 'అట్టు' తీసుకో" అంటూ ఓ అట్టు ఇచ్చింది. పిట్ట అట్టు తీసుకుని వెలుతూ వెలుతూ నూలు వొడికే ముసలమ్మ దగ్గరికి వచ్చి "అవ్వా అవ్వా! ఈ అట్టు దాచిపెట్టు. నేను మళ్ళీ వచ్చి తీసుకుంటా" అంటూ అట్టు అక్కడ పెట్టి వెళ్ళింది.

అట్టును చూస్తున్న ముసలామెకు నోట్లో నీళ్లూరి అట్టును ఒక్కపట్టున తినేసింది.

మరుసటి రోజు పిట్ట అట్టుకోసం వచ్చి అడిగింది.

"ఆకలేస్తే అట్టు తిన్నాను. ఇప్పుడే అట్టు కావాలంటే ఎక్కడి నుంచి తేను. అట్టు లేదు గిట్టులేదు ఇదిగో అట్టుకు బదులుగా పెట్టు" అంటూ చెంప మీద ఒక్కటేసింది.

పిట్ట ఏడుస్తూ ఇంటి దారి పట్టింది. దారిలో గోరంక "ఎందుకు ఏడుస్తున్నావు" అని అడిగింది. పిట్ట ఊ.... ఊ... అని ఏడుస్తూ

రొట్టె పోయి నూలు వచ్చే .....ఊ....ఊ....ఊ....

నూలు పోయి పంచె వచ్చే .....ఊ....ఊ....ఊ....

పంచెపోయి గుర్రం వచ్చే .....ఊ....ఊ....ఊ....

గుర్రం పోయి ఏనుగు వచ్చే .....ఊ....ఊ....ఊ....

ఏనుగు పోయి పిడకలు వచ్చే .....ఊ....ఊ....ఊ....

పిడకలు పోయి అట్టు వచ్చే .....ఊ....ఊ....ఊ....

అట్టు పోయి చెంపపెట్టు వచ్చే .....ఊ....ఊ....ఊ.... " అంటూ ఏడుస్తూ ఇంటికి పోయింది.